# బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు

## 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిల నియామకం

హైదరాబాద్,మే21 : బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కోసం అధినేత కేసీఆర్ ఇన్‌ఛార్జిలను ప్రకటించారు. డిజిటల్ ప్రక్రియలో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు జరగనుంది. 119 నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జిలను బీఆర్ఎస్ అధినేత నియమించారు. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలకు తెలంగాణ భవన్‌లో ఐటీ నిపుణులతో డిజిటల్ శిక్షణ ఇవ్వనున్నారు. సభ్యత్వ నమోదు కోసం డిజిటల్ యాప్‌ను రూపొందించారు. తెలంగాణ భవన్‌లో శిక్షణ తర్వాత.. పార్టీ జిల్లా కార్యాలయాల్లో పార్టీ ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జిల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలను నిర్వహించనున్నారు.


బలగం TV

BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం, 22 మే-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


# హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ



- గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనలు కోకొల్లలు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

హైదరాబాద్,మే21 : తెలంగాణలో గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతోందని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ జరుగుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోమాత రక్షణ కోసం శాంతియుతంగా పనిచేస్తున్న గోరక్షకులు, బీజేపీ కార్యకర్తలను అక్ర మంగా అరెస్టు చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. గోరక్షకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాంచందర్ రావు సూచించారు. గోవధకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ÷రిలిలీసులు పక్షపాత ధోరణిని విడిచిపెట్టి చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. గోమాత హిందువుల జీవన విధానంలో పవిత్రమైన భాగమని, పండుగల పేరుతో గోవధ చేస్తే సహించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

- రైతులు పిట్టల్లా రాలుతున్నా ధాన్యం కొనరా
- ఇప్పటికైనా మొద్దు నిద్ర వీడండి సీఎం గారు
- 23న జరిగే కేబినేట్ భేటీలో అయినా చర్చించండి
- సిఎం రేవంత్‌కు కెటిఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్, మే 21: పంట కొనుగోళ్ల సంక్షోభంపై ఎన్నాళ్లీ మొద్దునిద్ర ముఖ్యమంత్రి గారూ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్ ప్రశ్నించారు. కేబినెట్ మీటింగ్‌లోనైనా కళ్లు తెరవండి అని హితవు పలికారు. రైతుల ప్రాణాలు పోతున్నా.. పంటలు కొనరా..? కొనుగోలు కేంద్రాల్లో కుప్పకూలుతున్నా కనికరించరా అని మండిపడ్డారు. ధాన్యం తగలబెట్టుకుంటున్నా తండ్లాట తీర్చరా అని ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు.కొనుగోలు కేంద్రాల్లో ఈ మరణ మృదంగ మేంటని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రంలో రోడ్డెక్కని రైతు లేడు.. రాస్తారోకో జరగని రహదారి లేదని అన్నారు. ఇవాళ బూతులు తిడుతున్న రైతులే.. రేపు వాతలు పెడతారని హెచ్చరించారు. కాంటా పెట్టని కాంగ్రెస్

మిగతా 3లో..

# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

- కనీస వేతనాలు అమలుకు నిర్ణయం
- కేబినెట్ సబ్‌కమిటీ నిర్ణయాలకు ఆమోదం
- లబ్దిపొందనున్న 1.11 కోట్ల మంది కార్మికులు
- బండి తనయుడు భగీరథను పోలీసులే అరెస్ట్ చేశారు
- కెటిఆర్ ఇంకా ప్రభుత్వంలోనే ఉన్నాడన్న భ్రమలో ఉన్నారు
- సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్,మే21 : కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్ట పోయా రని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాలపై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. వర్క్ జోన్లను

మిగతా 3లో..

# కొనుగోలు కేంద్రంలో మంటలు



## దాదాపు వంద ధాన్యం బస్తాలు బుగ్గి

ఖమ్మం,మే21 : ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో రైతులు పొలాల్లో చెత్తకు నిప్పంటించడంతో ఆ మంటలు గాలికి వ్యాపించి కొనుగోలు కేంద్రంలోని వరి ధాన్యం బస్తాలకు అంటుకున్నాయి. దీంతో అక్కడ కాంటాలు వేసి ఉంచిన వరి బస్తాలు ఒక్కసారిగా మంటల్లో చిక్కుకుని దగ్ధమయ్యాయి. రైతులు వెంటనే మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ, గాలులు బలంగా వీయడంతో మంటలు అదుపులోకి రావడం లేదని ఆందోళన వ్యక్తం చేసారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించినా స్పందన ఆలస్యమైందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనలో సుమారు వంద ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయని, లక్షల రూపాయల నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి రాకపోతే ఇంకా పెద్ద ఎత్తున ధాన్యం నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సింగరేణికి సిరులు..

- సోలార్ ఎనర్జీ నిల్వ.. సింగరేణికి సిరులు..
- మిగులు సోలార్ విద్యుత్‌కు విలువ తెచ్చిన సింగరేణి
- సోలార్ విద్యుత్తు నిల్వ చేస్తున్న బీఈఎస్ఎస్
- తొలి అతిపెద్ద ప్రాజెక్టు సింగరేణిలో ఏర్పాటు
- నాలుగు నెలల్లోనే సత్ఫలితాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్, మే 21: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు రాష్ట్రంలోనే తొలిసారిగా సింగరేణిలో ఏర్పాటు చేసిన బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ సత్ఫలితాన్ని ఇస్తోంది. పగటిపూట ఉత్పత్తి జరిగే సోలార్ విద్యుత్తులో వినియోగించబడని విద్యుత్తును ఉచితంగా గ్రిడ్ కు సరఫరా చేయకుండా, బ్యాటరీలో నిలువ చేసుకొని, అవసరమైనప్పుడు వాడుకునే అవకాశం కలిగించే ఈ వ్యవస్థ సింగరేణికి ఆర్థిక లబ్ది చేకూర్చుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు నాలుగు నెలల క్రితం మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సింగరేణి సోలార్ ప్లాంట్‌కు అనుబంధంగా 1 మెగావాట్ బ్యాటరీ ఎనర్జీ సిస్టమ్ నెలకొల్పడం జరిగింది. ఇందు కోసం రూ.2.5 కోట్లను యాజమాన్యం వెచ్చించింది. రాష్ట్ర ప్రభుత్వం సౌర విద్యుత్తుకు అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకొని సింగరేణితో సహా పలు రాష్ట్ర సంస్థలు సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేస్తున్నాయి. సింగరేణి సంస్థ ఇప్పటికే 8 చోట్ల 245.5 మెగావాట్ల సామర్థ్యం గల సోలార్ ఎలాంట్లను ఏర్పాటు చేసింది. వీటిలో 147 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఓపెన్ యాక్సెస్ ప్లాంట్లుగా, మిగిలిన 98.50 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్ ను ఇన్ హౌజ్ ప్లాంట్ ్లగా గుర్తించి తెలంగాణ

మిగతా 3లో..


# పర్యాటక రంగానికి 'డిజిటల్' బూస్ట్



- ఇన్‌ఫ్లుయర్లు సామాజిక బాధ్యతతో తీసుకోవాలి
- డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌పై చైతన్యం కల్పించాలి
- త్వరలో 'ప్రభాత భేరి' సామాజిక చైతన్య కార్యక్రమం
- ఉత్తమ టూరిజం క్రియేటర్లకు అవార్డులు, ప్రోత్సాహకాలు
- 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో మంత్రి జూపల్లి కృష్ణారావు

మిగతా 3లో..

# లోన్ రికవరీ ఆడగాలకు కళ్లెం



- కొత్త నిబంధనలు ప్రతిపాదించిన ఆర్‌బిఐ
- కస్టమర్లను వేధించే చర్యలపై కఠిన ఆంక్షలు

న్యూఢిల్లీ, మే 21 : రుణాలు తిరిగి చెల్లించని సందర్భంలో వాటిని వసూలు చేసే విషయంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త ప్రతిపాదనలతో ముందుకొచ్చింది. లోన్ల రికవరీ పేరుతో కస్టమర్లను వేధించే బ్యాంకు లకు అడ్డుకట్ట వేసేందుకు కఠిన నిబంధనలను ప్రతిపాదించింది. ఈమేరకు 'కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటిటీస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్' పేరిట ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది. దీనిపై మే 31 వరకు వాటాదారులు, ప్రజల అభిప్రాయాలను సేకరించనుంది. అక్టోబర్ 1 నుంచి ఈ నిబంధనలు అమలు చేయనుంది.

మిగతా 3లో..

# ఎబోలా వైరస్ విజృంభణ

- ఇండియా-ఆఫ్రికా సమిట్ వాయిదా
- ఎయిర్‌పోర్ట్‌లో అడ్వయిజరీ జారీ




న్యూఢిల్లీ, మే 21 : ఆఫ్రికాలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ముఖ్యంగా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ వంటి దేశాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ పరిణామాల నడుమ దిల్లీ వేదికగా ఈ నెల 28-31 తేదీల మధ్య జరగాల్సిన 'ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమిట్' వాయిదా పడింది. భారత్, ఆఫ్రికన్ యూనియన్ కలిసి ఈమేరకు నిర్ణయం తీసుకున్నట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. కొత్త తేదీలను పరస్పర సంప్రదింపుల ద్వారా ఖరారు చేస్తామని తెలిపింది. ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రజారోగ్యానికి సంబంధించి విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఆఫ్రికా సీడీసీ, సంబంధిత సంస్థలకు మద్దతు ఇచ్చేందుకు భారత్ సిద్ధంగా ఉందని విదేశాంగశాఖ పేర్కొంది. మరోవైపు.. ఎబోలా వైరస్ వ్యవహారంలో దిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు కీలక అడ్వైజరీ జారీ చేసిన విషయం తెలిసిందే. కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ నుంచి వచ్చే ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. జ్వరం, తలనొప్పి, నీరసం, కండరాల నొప్పులు తదితర సమస్యలు కనిపిస్తే వెంటనే ఎయిర్‌పోర్టు వైద్యసిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

మిగతా 3లో..

# మణుగూరు-రామగుండం రైల్వే లైన్‌కు ఆమోదం?

- రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మాణం
- మారుమూల గిరిజన పల్లెలకు పట్టనున్న మహర్దశ
- రైల్వే ప్రాజెక్టులపై అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి చర్చ



న్యూఢిల్లీ,మే21 : తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కీలకమైన మణుగూరు-రామగుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దాదాపు రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే సౌకర్యం దక్కడంతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు పెద్ద ఉపశమనం లభించనుంది. మొత్తం 207.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ సరికొత్త రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటలతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుండి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), కాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త లైన్ పూర్తయితే మణుగూరు-రామగుండం మధ్య ఏకంగా 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీనివల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు, భద్రాచలం

మిగతా 3లో..

# రూపాయి పతనంపై ఆర్‌బిఐ దిద్దుబాటు



- అధికారులతో గవ్నర్ మల్హోత్రా మంతనాలు

**ముంబయి,మే21 :** రూపాయి విలువను స్థిరీకరించ డానికి, వడ్డీ రేట్ల పెంపుతో సహా అందుబాటులో ఉన్న అన్ని ప్రత్యామ్నాయ మార్గాలను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పరిశీలిస్తోందని సంబంధిత అధికారులను ఉద్దేశించి 'బ్లూమ్‌బెర్గ్' గురువారం ఒక నివేదికలో వెల్లడించింది. రూపాయి పతనాన్ని అడ్డుకు నేందుకు, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు గవర్నర్ సంజయ్ మల్హోత్రాతో సహా ఆర్‌బీఐ ఉన్నతాధికారులు వరుస అంతర్గత సమావేశాలు నిర్వహించినట్లు ఈ నివేదిక పేర్కొంది. గడిచిన బుధవారం నాటి ట్రేడింగ్‌లో రూపాయి అంతర్గతంగా 96.95 వద్ద రికార్డు స్థాయి కనిష్టానికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని డాలర్‌తో పోలిస్తే 96.86 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ ఇండెక్స్ బలంగా ఉండటం, ముడి చమురు ధరలు అధికంగా కొనసాగడంతో డాలర్లకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ పరిణామాల వల్లే రూపాయి విలువ చారిత్రక కనిష్ట స్థాయికి పడిపోయి, కొత్త ముగింపు రికార్డును నమోదు చేసింది. అయితే, గురువారం ఉదయం ట్రేడింగ్‌లో రూపాయి తన సర్వకాలిక కనిష్ట ముగింపు స్థాయి నుండి 41 పైసలు పుంజుకుని అమెరికా డాలర్‌తో పోలిస్తే 96.45కు చేరుకుంది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 96.25 వద్ద బలంగా ప్రారంభమై, ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 96.45 వద్ద ట్రేడయ్యింది. బుధవారం నాటి ముగింపు ధర 96.86తో పోలిస్తే ఇది 41 పైసల రికవరీని సూచిస్తోంది.

# పాక్‌లోనే పహల్గాం దాడికి పథకం

- ఎన్ఐఎ ఛార్జ్‌షీట్‌లో సంచలన విషయాలు

**న్యూఢిల్లీ,మే21 :** జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడిపై జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఉగ్రదాడికి సంబంధించి.. వ్యూహ రచన, పథకం అమలు అంతా పాకిస్థాన్ కేంద్రం గానే సాగిందనేందుకు బలమైన సాక్ష్యాలతో ఎన్ఐఏ బహిర్గతం చేసింది. ఈ ఘటన జరిగిన వెంటనే ఈ దాడికి తామే బాధ్యులమంటూ లష్కరే తోయ్యిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ దాడికి వ్యూహ రచన నుంచి టీఆర్ఎఫ్ చేసిన ఈ ప్రకటన వరకు అంతా పాకి స్థాన్‌లోనే జరిగిందని వివరించింది. అందుకు సం బంధించిన ఫోన్ కాల్స్, ఐపీ అడ్రాస్ తదితర అం శాలను ఈ ఛార్జిషీట్‌లో ఎన్ఐఏ పొందుపరిచింది. ఈ ఉగ్రదాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఫైజల్ జాట్ అలియాస్ సులేమాన్ షా, హబీబ్ తాహిర్ అలియాస్ జిబ్రాన్, హమ్జా అఫ్ఘానీల ఐపీ అడ్రస్, ఫోన్ నెంబర్ల తోపాటు ఇతర ఆధారాలన్నీ పాక్‌లోని ఈ దాడి వెనుక సూత్రధారులతో వీరికి సంబంధాలు ఉన్నట్లు ఎన్ఐఏ గుర్తించింది. సైనిక బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ మహాదేవ్'లో ఈ ముగ్గురు ఉగ్రదాలను కాల్చి చంపాయి. వారి నుంచి మొబైళ్లు స్వాధీనం చేసుకున్నాయి. అవి పాక్‌లోనే కొనుగోలు చేసినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో తేలింది. ఈ మొబైల్ ఫోన్లు.. లాహోర్, కరాచీలో కొనుగోలు చేసినట్లు గుర్తించాయి. 2025, ఏప్రిల్ 22వ తేదీన పహల్గాంలోని బైసరన్ లోయలోకి ఉగ్రవాదులు ప్రవేశించి.. పర్యాటకులపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో మొత్తం 25 మంది మరణించారు. ఈ కాల్పుల ఘటనకు తామే బాధ్యులమని లష్కరే తోయ్యిబా అనుబంధ సంస్థ ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ప్రకటించింది. అది కూడా సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది.



దీనిపై అంతర్జాతీయంగా విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో టీఆర్ఎఫ్ వెనక్కి తగ్గింది. ఈ టీఆర్ఎఫ్ ప్రకటనపై కూడా ఎన్ఐఏ విచారణ జరిపింది. ఇవి కూడా పాకిస్థాన్ నుంచే వచ్చాయని వివరించింది. ఉగ్రదాడికి టీఆర్ఎఫ్‌కు చెందిన ఉగ్రవాది సైపుల్లా అలియాస్ సాదిజ్ జాట్ కీలక సూత్రధారి అని ఎన్ఐఏ స్పష్టం చేసింది. అతడి ఆదేశాల మేరకే తీవ్రవాదులు బైసరన్ లోయలో రెక్కి నిర్వహించారని తన ఛార్జిషీట్‌లో ఎన్ఐఏ వెల్లడించింది. ఈ దాడి జరిగిన రోజు.. ఆ తీవ్రవాదులతో సైపుల్లా నిరంతరం చర్చలు జరిపినట్లు గుర్తించామని ఎన్ఐఏ తెలిపింది. అంతేకాకుండా ఈ దాడి తర్వాత ఎలా తప్పించుకోవాలనే అంశాన్ని కూడా ఉగ్రవాదులకి సైపుల్లా వివరించినట్లు ఎన్ఐఏ తెలిపింది. అంశాలన్నీ ఎన్ఐఏ తన ఛార్జిషీట్‌లో పొందుపరిచింది. మరోవైపు ఈ పహల్గాం ఉగ్రదాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని పాక్ స్పష్టం చేసింది. భారత్ తమపై కావాలని ఆరోపణలు చేస్తుందంటూ ప్రపంచానికి పాక్ చాటే ప్రయత్నం చేసింది. కానీ అంత మందిని పొట్టనపెట్టుకున్న ఈ ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ ప్రమేయం ఉందని ఎన్ఐఏ తన దర్యాప్తులో నిగ్గు తేల్చింది.

# ఢిల్లీలో ఎండల తీవ్రత

## వడదెబ్బకు బెంగాల్ విద్యార్థి మృతి

**న్యూఢిల్లీ,మే21 :** దేశ వ్యాప్తంగా ఎండలు దంచికొడు తున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు భగభగమంటున్నాడు. ఉదయం 10 గంటల తర్వాత బయటకు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పగటి పూట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో 45 డిగ్రీలను మించి ఉష్ణోగ్రతలు నమో దు అవుతున్నాయి. ఎండ వేడి తట్టుకోలేక ప్రజలు నా నా ఇబ్బందులు పడుతున్నారు. వడదెబ్బ కారణంగా ప్రాణాలు సైతం పోతున్నాయి. ఢిల్లీలో ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ఉష్ణో గ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓ యువకుడు వడదెబ్బ కారణంగా ప్రాణాలు కోల్పోయాడు. ఆ వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన 24 ఏళ్ల ఓ విద్యార్థి ఢిల్లీలో చదువుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం అతడు వడదెబ్బకు గురై కుప్పకూలాడు. స్థానికులు అతడిని డాక్టర్ రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రిలో చేర్చారు. డాక్టర్లు బాధితుడి శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీల ఫారెన్ హీట్ ఉన్నట్లు గుర్తించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి చికిత్స అందించారు. అయితే,



డాక్టర్ల ప్రయత్నాలు ఫలించలేదు. చికిత్స పొందుతూ అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఎండాకాలం మొదలైన తర్వాత ఢిల్లీలో చోటుచేసుకున్న మొదటి వడదెబ్బ మరణం ఇదే కావటం గమనార్హం. ఈ విషయాన్ని వైద్యాధికారులు స్వయంగా వెల్లడించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. మధ్యాహ్నం వేళ అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రాకూడదని హెచ్చరించారు. ఎండలోకి వెళ్లాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# ధాన్యం సేకరణ వేగంగా చేపట్టాలి

**పెద్దపల్లి,మే21 :** కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేపట్టాలని తహసీల్దార్ మద్ద సాని రమేష్, ఎంపీడీవో తూమట్ల విజయ్ కుమార్ అన్నారు. చిగురుమామిడి మండలంలోని సుందరగిరి, నవాబుపేట, గాగి రెడ్డిపల్లె, ఇందుర్తి, గునుకులపల్లి, ఓగులాపూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు గురువారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల కొరత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహ కులకు సూచిం చారు. ట్రాక్టర్ల ను అందుబాటులో ఉంచుకొని వెనువెం టనే రైస్ మిల్లులకు ధాన్యాన్ని అన్లోడ్ కి పంపించా లన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున ఉద యం సాయంత్రం వేళల్లో కొనుగోలు చేపట్టాలన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవా లని నిర్వాహకులకు సూచిం చారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, మాజీ జడ్పీటీసీ గీకురు రవీందర్, నాయకులు చిట్టిమల్ల రవీందర్, బడుకోలు దేవేందర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

- సాంకేతికతను దేశానికి పరిచయం చేసిన రాజీవ్
- రాజీవ్‌కు నివాళి అర్పించిన సిఎం రేవంత్





హైదరాబాద్,మే21 : దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. 'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హను మంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు..రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం





- కంచి పీఠాధిపతి విజయేంద్రసరస్వతి రాక
- పుణ్యస్నానాలు ఆచరించిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు

**కాళేశ్వరం,మే21 :** సరస్వతీ నది అంత్య పుష్కరాలు వైభవంగా ఆరంభమయ్యాయి. గురువారం ఉద యం కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశంకర విజయేంద్ర సరస్వతి స్వామి, మంత్రులు శ్రీధర్‌బాబు, కొండా సురేఖ పుష్కరాలను ప్రారంభించారు. వీరంతా తొలుత పుష్కరస్నానం ఆచరించి ప్రారంభంచారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహినిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం. ఆది పుష్కరాల్లో నది స్నానం ఆచరించటం.. పితృతర్ప ణాలు ఇవ్వడం ఎలా ఫలితాలొస్తాయో.. అంత్య పుష్కర సమయంలోనూ ఆయా కార్యక్రమాలతో అవే ఫలితాలుంటాయని పండితులు చెబుతున్నారు.


# నేడు ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్ మ్యాచ్



- బ్లాక్‌లో టిక్కెట్ల దందా...దందాపై పోలీసుల ఆరా

**హైదరాబాద్,మే21 :** ఉప్పల్ స్టేడియం వేదికగా శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు భారీ డిమాండ్ నెలకొన్న నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం టికెట్ల బ్లాక్ మార్కెట్ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. టికెట్ల అమ్మ కాలు ప్రారంభమైన వెం టనే 'సోల్డ్ అవుట్' కావ డంతో అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ముఠాలు ముందుగానే భారీ సంఖ్యలో టికెట్లు కొనుగోలు చేసి, వాటిని బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నా రనే ఆరోప ణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో నిజమైన క్రికెట్ అభిమానులకు టికెట్లు దొరకకుండా పోతున్నాయని ఫ్యాన్స్ మండిపడుతున్నారు. ప్రత్యేకంగా జొమాటో డిస్ట్రిక్ యాప్స్ ద్వారా జరిగిన బుకింగ్‌లపై అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. టికెట్లను బ్లాక్ మార్కె ట్‌కు మళ్లించారని అభిమానులు ఆరోపిస్తున్నారు. సాధా రణ ధరలకు లభించాల్సిన టికెట్లు పలు మార్లు ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని, దీంతో నిజమైన అభిమా నులు మ్యాచ్‌లను ప్రత్యక్షంగా వీక్షించే అవకాశాన్ని కోల్పోతున్నారని ఫ్యాన్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై పెద్ద ఎత్తున చర్చ జరుగు తోంది. ఈ వ్యవహారంపై మల్కాజ్‌గిరి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. బ్లాక్ టికెట్ల విక్రయాలపై ఇప్పటివరకు 10 కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మ్యాచ్ ప్రారంభమయ్యే వరకు స్టేడియం పరిసర ప్రాంతాలు, ఆన్‌లైన్ ఎలాట్‌ఫార్మ్‌లు, సోషల్ మీడియాపై నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. టికెట్లను అక్రమంగా అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభిమానులు కూడా అధికారిక ప్లాట్‌ఫాంల ద్వారానే టికెట్లు కొనుగోలు చేయాలని, బ్లాక్ మార్కెట్‌కు ప్రోత్సాహం ఇవ్వొద్దని సూచించారు. ఐపీఎల్ మ్యాచ్‌లకు భారీ డిమాండ్ ఉండటంతో ప్రతి సీజన్‌లో బ్లాక్ టికెట్ల సమస్య తలెత్తుతోంది. ఉప్పల్‌లో రేపు జరిగే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మ్యాచ్‌కు భారీ క్రేజ్ ఉండటంతో బ్లాక్ టికెట్ల దందా మరింత పెరిగిందని అభిమానులు చెబుతున్నారు.

# విజయ్ కేబినేట్‌లో కొత్తగా 23మందికి చోటు



## ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు మంత్రి యోగం

**చెన్నై,మే21 :** తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే పార్టీ అధినేత విజయ్ తన కేబినెట్‌ను విస్తరించారు. కొత్తగా 23 మంది ఎమ్మెల్యేలు నేడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. 21 మంది టీవీకే ఎమ్మెల్యేలతో పాటు మిత్రపక్షం కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు ఎమ్మెల్యే లకు మంత్రివర్గంలో చోటుదక్కింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, తనకు మద్దతిచ్చిన కాంగ్రెస్‌తో పాటు ఐయూఎమ్ఎల్, వీసీకే పార్టీలకు కూడా సీఎం విజయ్ కేబినెట్ బెర్తు ఆఫర్ చేశారు. అయితే, మరికొంతకాలం తరువాత ఐయూఎమ్ఎల్, వీసీకేలు కేబినెట్‌లో చేరే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. సీపీఐ, సీపీఎంలను కూడా సీఎం విజయ్ మంత్రివర్గంలోకి ఆహ్వానించినట్టు మంత్రి ఆధవ్ అర్జున తెలిపారు. వీసీకే చీఫ్ తోల్ తిరుమావళన్ మంత్రివర్గంలో చేరాలని తాము ఆశిస్తున్నట్టు కూడా పేర్కొన్నారు. మే 10న జరిగిన ప్రమాణస్వీకారంలో విజయ్‌తో పాటు 9 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఇక తమిళనాడు కేబినెట్‌లో గరిష్ఠంగా 35 మంది మంత్రులకు అవకాశం ఉంది. తాజాగా 23 ఎమ్మెల్యేలు మంత్రులుగా చేరడంతో మంత్రి వర్గం సంఖ్య 32కు చేరింది. దీంతో, మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో చోటుదక్కే ఛాన్స్ ఉంది.

# కంటెయినర్‌లో మంటలు

## మంటల ధాటికి 8 కొత్త కార్లు బుగ్గి

**మెదక్,మే21 :** మెదక్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. తూప్రాన్ సమీపంలో జాతీయ రహదారి ఎన్‌హెచ్-44పై ప్రయాణిస్తున్న కంటైనర్ లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మహారాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్‌కు వస్తున్నఈ కంటైనర్ లారీ అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లారీలో కొత్తగా తరలిస్తున్న ఎనిమిది మారుతీ కార్లు ఉన్నాయి. మంటలు ఒక్కసారిగా వ్యాపించి కంటైనర్‌తో పాటు అన్ని కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు ఎగిసిపడటంతో జాతీయ రహదారిపై భయాందోళన వాతావరణం నెలకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదం కారణంగారహదారిపై కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భద్రతా చర్యల్లో భాగంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలను పోలీసులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే విషయం. అయితే కోట్ల రూపాయల ఆస్తినష్టం జరిగిన ట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ లేదా సాంకే తిక లోపం వల్లే ఈ మంటలు చెలరేగి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# పుల్వామా ఉగ్రదాడి సూత్రధారి హతం

## ఆక్రమిత కాశ్మీర్‌లో దుండగుల చేతిలో హతం

**న్యూఢిల్లీ,మే21 :** 2019 పుల్వామా ఉగ్రదాడికి కీలక సూత్రధారిగా భావిస్తున్న హమ్జా బుర్హాన్ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో హతమైనట్లు సమాచారం. ముజఫరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరపడంతో అతడు మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ కాన్వా య్‌పై జరిగిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు మర ణించారు .పుల్వామా దాడికి పాకిస్థాన్‌కు చెందిన జైష్-ఎ-మహ్మద్ ఉగ్రసంస్థ బాధ్యత వహించింది. జైష్-ఎ-మహ్మద్ సంస్థకు అను బంధంగా పని చేసిన హమ్జా బుర్హాన్ పుల్వామా దాడి ప్రణాళికలో కీలక పాత్ర పోషించాడని భారత దర్యాప్తు సంస్థలు అనుమానిం చా యి. తాజాగా అతడు గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో హతమవడం సంచలనంగా మారింది . ఇటీవల పాకిస్థాన్‌లో భారత వ్యతిరేక ఉగ్ర వాదులు వరుసగా గుర్తు తెలియని వ్యక్తుల దాడుల్లో హతమవుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. గతంలో పఠాన్‌కోట్, సంజ్వాన్, కాంద హార్ హైజాక్ వంటి ఘటనలతో సంబంధం ఉన్న పలువురు ఉగ్రవాదులు కూడా ఇదే తరహాలో మృతి చెందారు.

# కొనుగోలు కేంద్రాల్లో మరణమృదంగం

సర్కారుకు రైతు చేతిలోనే కౌంట్ డౌన్ మొదలైందని అన్నారు. రైతుకు రక్షణగా కేసీఆర్ అమలుచేసిన ఒక్కో పథకానికి గత రెండేన్నరేళ్లుగా పాతరేసిన మీరు మీ చేతకానితనంతో అన్నదాత వెన్నువిరిచారు.ఇవాళ మీ అరాచక పాలన ఆనవాళ్లు పరాకాష్టకు చేరాయి. అష్టకష్టాలు పడి పండించిన పంటను కొనే దిక్కులేక రెండునెలలుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర్తనాదాలు చేస్తున్నారు. చేతకాని మీ సర్కారు నిర్వాకం వల్ల తెలంగాణ వ్యాప్తంగా ఏ మూలన చూసినా ఈరోజు రైతులు నిత్యం ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలతో హోరెత్తిస్తున్నారు. పంట అమ్ముకుందామనే ఆశతో వచ్చిన రైతులు రోజుల తరబడి పడిగాపులు పడలేక కొనుగోలు కేంద్రాల్లోనే గుండెపగిలి కుప్పకూలుతున్నా మీ సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. 70 సార్లు ఢిల్లీకి చక్కర్లు కొట్టడంలో మీకున్న శ్రద్ధలో ఒక్క శాతం రైతులపై పెట్టి ఉంటే ఈ దుస్థితి వచ్చేది కాదన్నారు. మీ కుర్చీని కాపాడుకోవడానికి ఢిల్లీకి మూటలు మోయడం తప్ప రైతులు తెచ్చిన ధాన్యాన్ని కొనాలన్న సోయి మాత్రం మీలో కనిపించడం లేదు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద దాదాపు పదిమంది రైతులు వడదెబ్బకు తోడు సర్కారు చేసిన ద్రోహానికి తమ నిండు ప్రాణాలు కోల్పోయారు. ధాన్యం కుప్పలు మీ అసమర్థతకు ప్రత్యక్ష సాక్ష్యాలు. విలువైన భూములను తెగనమ్మి వేలకోట్లు దోచుకోవాలన్న ఉత్సాహం తప్ప రైతుల పంటలను కొనాలన్న ధ్యాస మీలో ఏమాత్రం కనిపించడం లేదు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా అనేక జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో రోజుకు కనీసం ఒక్కటంటే ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదు. చివరికి గన్నీ బ్యాగు కోసం రైతులే 50 రూపాయల చొప్పున డిపాజిట్ చేసే దుస్థితి తెచ్చినందుకు మీరు, మీ ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి. అన్నదాతలు అడుగడుగునా పడిగాపులు పడుతుంటే వాటిని వదిలేసి, పర్యాటక వారోత్స వాలు నిర్వహించాలన్న మీ సర్కారుకు ప్రాధాన్యతలే కాదు, చివరికి సోయి కూడా లేదని తేలిపోయింది.కేసీఆర్ హయాంలో మూడు నెల ముందు నుంచే పంటల కొనుగోలు ప్రణాళికలను పకడ్బందీగా అమలుచేసే వారు. గన్నీ బ్యాగుల నుంచి మొదలుకుని రైతుల ఖాతాల్లో పంట డబ్బులు సకాలంలో జమ అయ్యేదాకా నిరంతర సమీక్షలతో పర్యవేక్షించేవారు. కొనుగోలు కేంద్రాల్లో అకాల వర్షాల నుంచి తమ పంటను కాపాడుకునేందుకు చివరికి టార్పాలిన్లు కూడా సమకూర్చలేని మీ కాంగ్రెస్ సర్కారు ఉండి రైతులకు ఏం ప్రయోజనం అన్నారు.60 రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో కాంటా పెట్టని కాంగ్రెస్ సర్కారుకు మరణశాసనం రాసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రమంతా రైతుల నిరసనలు హోరెత్తుతున్న ఈ తరుణంలో 23న నిర్వహించే కేబినెట్ సమావేశంలోనైనా లెంపలేసుకుని దిద్దుబాటు చర్యలు చేపట్టండని కెటిఆర్ తన లేఖలో కోరారు.

## కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

ప్రభుత్వం శుభవార్తమూడు భాగాలుగా విభ జించాం. జోన్-1లో మున్సిపల్ కార్పొరేషన్స్, జోన్-2లో మున్సిపాలిటీలు, జోన్-3లో గ్రామీణ ప్రాంతాలను తీసుకుని కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు పక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ పక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం.

## మణుగూరు-రామగుండం రైల్వే లైన్‌కు ఆమోదం?

శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వెనుకబడిన మారుమూల గిరిజన ప్రాంతాలకు ఒక పెద్ద వరంగా మారబోతోంది. దశాబ్దాలుగా రైలు ముఖం చూడని ఎన్నో గ్రామాలకు ఈ లైన్ ద్వారా రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో లభించే బొగ్గు, ఖనిజాలు, ఎరువులు , ఇతర పారిశ్రామిక సరుకు రవాణాకు ఈ రైల్వే లైన్ అత్యంత కీలకంగా మారనుంది. దీనివల్ల సింగరేణి బొగ్గు గనుల రవాణా మరింత వేగవంతం కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ సరికొత్త ప్లాన్ సిద్ధం చేసింది. డీపీఆర్ తయారీ, భూసేకరణ, వివిధ ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు తీసుకునే బాధ్యతలను రైల్వే శాఖ చూసుకుంటుంది. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణం , నిధుల సమీకరణ పనులను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థకు అప్పగిస్తారు. దీనికోసం రైల్వే శాఖ త్వరలోనే టెండర్లను ఆహ్వానించనుంది. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం.. మొదటి ఏడాదిలో పూర్తిగా భూసేకరణ పక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత నాలుగు సంవత్సరాల్లో అంటే మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ కొత్త రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలావుంటే కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. తెలంగాణలో రైల్వేప్రాజెక్టుల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ఎలక్ట్రిఫికేషన్ తదితర ప్రాజెక్టులపై మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణలోని 42 ప్రధాన రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి వివరంగా చర్చించారు. హైదరాబాద్ నగరంతో పాటుగా, చుట్టుపక్కల ప్రాంతాల ప్రయాణికులకు కీలకమైన రవాణా సౌకర్యంగా ఉన్న విషయంపై మాట్లాడారు. టైమింగ్స్ రెగ్యులరైజేషన్, సౌకర్యాలను మరింత మెరుగు పరిచేలా చొరవ తీసుకోవాలని తాను కోరానని.. దీనికి కేంద్ర రైల్వేమంత్రి సానుకూలంగా స్పందించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి తదనుగుణంగా ఎంఎంటిఎస్ మెరుగుపరచడం కోసం చర్యలు తీసుకుంటామని కిషన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కొత్త రైల్వేలైన్లు, హైస్పీడ్ రైల్ కారిడార్ పనుల పురోగతి తదితర అంశాలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో తెలంగాణలో రైల్వేల అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి అంకితభావంతో పనిచేస్తోందని వెల్లడించారు. రానున్న రోజుల్లోనూ రైల్వేనెట్‌వర్క్ పెంచడం, ప్రజలకు సౌకర్యాల అభివృద్ధిలో పూర్తి సహకారం ఉంటుందని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు.

## సింగరేణికి సిరులు..

విద్యుత్తు గ్రిడ్డులకు అనుసంధానం చేసింది. ఈ ఇన్ హౌజ్ ప్లాంట్ ట్ల విద్యుత్తును కూడా తెలంగాణ విద్యుత్ శాఖ గ్రిడ్లకు అనుసంధానం చేసినప్పటికీ విద్యుత్ ఒప్పందం ప్రకారం ఇక్కడ స్థానిక అవసరాలకు వాడగా మిగిలిన విద్యుత్తుకు మాత్రం తెలంగాణ డిస్కము ఎటువంటి చెల్లింపులు జరపదు. మిగులు విద్యుత్తును కేవలం ఉచితంగానే గ్రిడ్డుకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ విధంగా ఇన్ హౌస్ ఎ÷-లాంట్ల నుండిరోజుకు వేలాది యూనిట్ల మిగులు విద్యుత్తును ఎటువంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా గ్రిడ్ కు సరఫరా చేయడం జరుగుతోంది. అయితే ఈ మిగులు విద్యుత్తును కూడా సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు సింగరేణి సంస్థ రాష్ట్రంలోనే తొలిసారిగా ఒక మెగావాట్ సామర్థ్యం గల బీఈఎస్ఎస్ ను మందమర్రి ఎ÷-లాంట్ లో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసింది. మందమర్రి లో గల 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ సమర్థంగా పనిచేస్తూ మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియా లలోని గనులకు, కాలనీలకు అవసరమైన విద్యుత్తును అందిస్తోంది. అయితే స్థానిక విద్యుత్తు అవసరాలకు సరిపోగా ఇంకా కొంత విద్యుత్తు మిగిలిపోతుంది. ఈ నేపథ్యంలో మందమర్రి ఎ÷-లాంటు లో జనవరి నెలలో బ్యాటరీ ఎనర్జీ స్టోరీ సిస్టం ను సింగరేణి ఏర్పాటు చేసింది. అప్పటి నుండి ఇప్పటి వరకు బిఈఎస్ఎస్ యూనిట్ స్థానిక అవసరాలకు వినియోగించగా ఇంకా మిగిలిన 3,35,485 యూనిట్ల విద్యుత్తును నిల్వ చేసుకొని అవసరమైన సందర్భంలో వినియోగించుకుంది. తద్వారా సింగరేణి సంస్థకు రూ. 25,66,460 ఆర్థిక లబ్ది చేకూరింది. ఇక మెగావాటు సామర్థ్యం గల బీఈఎస్ఎస్ యూనిట్ ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్తును ఆదా చేయడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన బీఈఎస్ఎస్ విజయవంతం అవడంపై సింగరేణి యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మరిన్ని ప్రాజెక్టులను చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు యాజమాన్యం ప్రకటించింది.

## లోన్ రికవరీ ఆడగాలకు కళ్లెం

వ్యక్తిగత, కారు, హోమ్‌లోన్ విషయంలో రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లింపులు చేయనప్పుడు మొబైల్‌ఫోన్‌ను లాక్ చేయడం, దాని ఫీచర్లను నిలిపివేయడం వంటివి బ్యాంకులు చేయకూడదని పేర్కొంది. ఒకవేళ ఆ మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్‌ను కొనుగోలు చేయడానికి సదరు బ్యాంకే లోన్ ఇచ్చి ఉంటే, అప్పుడు మాత్రమే ఫోన్ ఫీచర్లను నిలిపివేసే హక్కు బ్యాంకుకు ఉంటుందని ఆర్‌బీఐ స్పష్టంచేసింది. అది కూడా సదరు లోన్ బకాయి పడి 90 రోజుల గడువు దాటి ఉండాలి. కస్టమర్‌లకు నోటీసులు ఇచ్చినా స్పందించని సందర్భాల్లోనే చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. ఫోన్ బ్లాక్ చేసినప్పటికీ.. ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్టులు నిలిపివేయకూడదని పేర్కొంది. ఒకవేళ కస్టమర్ తన బకాయిని చెల్లిస్తే గంటలోనే ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలి. ఆలస్యమైతే గంటకు రూ.250 చొప్పున బ్యాంకే తిరిగి రుణగ్రహీతకు పరిహారంగా చెల్లించాల్సి ఉంటుంది. లోన్ రికవరీ కోసం బ్యాంక్ ఉద్యోగులు లేదా రికవరీ ఏజెంట్లు చేసే అన్ని కాల్స్ సమయం, నంబర్లను రికార్డ్ చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది.

# సమస్యలు ప్రస్తావిస్తే వ్యక్తిగత దూషణలా?

- ధాన్యం సకాలంలో కొనుగోలు చేయడంలో విఫలం
- ఇసుక అక్రమ రవాణా చేస్తున్నదెవరో చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ సవాల్



**పెద్దపల్లి,మే21 :** పెద్దపల్లి నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న కొనుగోళ్ల సమస్యలు, మట్టి తరలింపు లాంటి అంశాలపై తాను మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడితే.. రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా.. పెద్దపల్లి ఎమ్మెల్యేగా పనిచేస్తున్న చింతకుంట విజయరమణారావు విచక్షణ కోల్పోయి మాట్లాడటం ఆయన సంస్కారానికే నిదర్శనమని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హితవు పలికారు. గురువారం పెద్దపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. లుచ్చా పని చేసేటోడికి అందరూ లుచ్చలాగే కనిపిస్తారని, దొంగ పని చేసేటోడికి అందరూ దొంగలాగే కనిపిస్తారు..'అంటూ చురకలు అంటించారు. మట్టి వ్యవహారంపై స్పందిస్తూ, తాను చెరువు మట్టిని పొలాల్లో వేయడం అనేది అప్పటి ప్రభుత్వ పథకం 'మిషన్ కాకతీయ'లో భాగం అన్నారు. చెరువులు లోతు కావాలి, మట్టి పొలాల్లో పడాలి, భూసారం పెరగాలి అనే ఆలోచనతో ప్రభుత్వం ఆ పథకం తీసుకువచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మైనింగ్, ఇరిగేషన్ శాఖల ద్వారా నియంత్రణ తీసుకువచ్చి రైతులకు మట్టి వినియోగం ప్రోత్సహించిందని గుర్తు చేశారు. ఇసుక అక్రమాల అంశంలో కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. స్థానిక అవసరాల కోసం ఉచిత ఇసుక విధానం తానే తీసుకొచ్చానని, కానీ ఇప్పుడు అదే పేరుతో అక్రమ రవాణా జరుగుతోందని అన్నారు. పిట్టలఎల్లయ్యపల్లి, నారాయణపూర్, సుగ్లాంపల్లి ప్రాంతాల్లో ఇసుక డంపులు వేసి రాత్రిళ్లు హైదరాబాద్‌కు లారీలు పంపుతున్నారని గుర్తు చేశారు. ఇసుక లారీలను పట్టుకున్న అధికారులను బదిలీ చేసిన ఘటనలను కూడా ఆయన ప్రస్తావించారు. ఎన్నికల్లో తప్పుడు హామీలు, అబద్ధాలతో గెలిచారని ఆరోపిస్తూ, ఇప్పుడు వాటిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉందన్నారు. తాను ఎక్కడికి వెళ్లినా ప్రజల నమ్మకంతో ఒంటరిగానే వెళ్తానని, కొందరిలా వంద మందిని వేసుకుని తిరగాల్సిన భయం తనకు లేదు' అని ఎద్దేవా చేశారు.

## హైబ్రిడ్ విధానంలో టిడిపి మహానాడు

- 19 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం
- టిడిపి అధినేత చంద్రబాబు వెల్లడి



**అమరావతి,మే21 :** హైబ్రిడ్ విధానంలో నిర్వహించే మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపుని చ్చారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సమావేశం ముగిసింది. మహా నాడు నిర్వహణ ప్రధాన అజెండాగా సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కార్యకర్తే అధినేత అనేది మహానాడులో వినిపించాలన్నారు. మహిళలకు తెలుగుదేశం ఇస్తున్న ప్రాధాన్యం మహానాడు వేదికగా అందరికీ అర్థమయ్యేలా చాటాలని సూచించారు.సంప్రదాయ ఓటును జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలు పార్టీ ఆవిర్భావం నుంచీ వెన్నుదన్నుగా ఉన్నారని చెప్పారు. బీసీల అభివృద్ధికి పార్టీ కట్టుబడి ఉందనే సందేశం స్పష్టంగా వెళ్లాలని నేతలకు తెలిపారు. రోజూ ఉదయం 9 గంటల నుంచే 2 రోజుల మహానాడు ప్రారంభిద్దామన్నారు. మండల స్థాయిలో నిర్వహిద్దామనే ప్రతిపాదనపైనా చర్చ జరగాలన్నారు. క్లస్టర్ స్థాయిలోనే నిర్వహిం చాలని నిర్ణయించినట్లు తెలిపారు. మహానాడులో ప్రవేశపెట్టే 19 తీర్మానాలకు పొలిట్ బ్యూరో ఆమోదం తెలిపింది. సమయపాలన పాటిం చాలని.. ప్రతి వక్తా తమకు కేటయించిన అంశంలో నిష్ణాతుడై సమయపాలన పాటిస్తూ విషయం సూటిగా చెప్పాలని ఆదేశించారు. మహానాడులో ప్రవేశపెట్టే తీర్మానాలపై సీఎం చంద్రబాబు పలు సూచనలు చేశారు.

## 'స్త్రీశక్తి' థీమ్‌తో 2026 మహానాడు నిర్వహణ


- ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా చర్చ
- పెట్టుబడులు, యువతకు అవకాశాలపైనా ప్రస్తావన
- టిడిపి పొలిట్ బ్యూరోలో పలు అంశాలపై చర్చ



**అమరావతి,మే21:** 2026 మహానాడును 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహించాలని పొలిట్‌బ్యూరో టిడిపి నిర్ణయించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు మహిళా సంక్షేమం కోసం చేపట్టిన పథకాలు, మహిళల భాగస్వామ్యంతో అమలు చేసిన కార్యక్రమాలను మహానాడు వేదికగా ప్రజలకు తెలియజేయాలని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు సూచించారు. మహిళల భాగస్వామ్యంతోనే ప్రతి సంక్షేమ పథకాన్ని రూపొందించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, యువతకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాలపై మహానాడులో సమగ్ర చర్చ జరగాలని దిశానిర్దేశం చేశారు.తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సమావేశం గురువారం మం గళగిరిలోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. నూతన కార్యవర్గం, పొలిట్‌బ్యూరో నియామకం తర్వాత తొలిసారి ఈ భేటీ జరిగింది. ఈ సమావేశానికి వర్చువల్‌గా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. ఈ భేటీలో మహానాడు నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మహానాడు వేదికగా చేపట్టాల్సిన తీర్మానాలు, పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రచారంపై విస్తృతంగా చర్చించారు. ఈసారి మహానాడులో మొత్తం 20 కీలక తీర్మానాలను ప్రవేశపెట్టాలని పొలిట్ బ్యూరో నిర్ణయించింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌కు సంబం ధించిన 10 తీర్మానాలు, తెలంగాణకు సంబంధించిన 4 తీర్మానాలు, అండమాన్‌కు సంబంధించిన ఒక తీర్మానం, ఉమ్మడి అంశాలపై 4 తీర్మానాలు, రాజకీయ తీర్మానాలు ఉండనున్నాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పెట్టుబడులు, మహిళా సాధికారత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లేలా మహానాడును నిర్వహించాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమానికి రెండు రోజుల ముందే ప్రతి ఇంటిపై టీడీపీ జెండా ఎగురవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ అగ్రనాయకత్వం నుంచి క్షేత్రస్థాయి కార్యకర్తల వరకు అందరినీ మహానాడులో భాగస్వాములను చేసేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మహానాడు ప్రారంభానికి ముందు రాష్ట్రంలోని అన్ని క్లస్టర్లలో దివంగత మాజీ సీఎం నందమూరి తారక రామారావు విగ్రహాలకు నివాళులు అర్పించి కార్యక్రమాలను ప్రారంభించాలని నిర్ణయించారు. అలాగే ఎన్టీఆర్ సిద్ధాంతాలు, తెలుగుదేశం పార్టీ చరిత్రను నేటి తరానికి తెలియ జేసేలా ప్రత్యేక ప్రజెంటేషన్లు నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ ఆవిర్భావం నుంచి జరిగిన రాజకీయ, సామాజిక మార్పులను మహానాడు వేదికగా ప్రదర్శించాలని సీఎం మార్గనిర్దేశం చేశారు.పొలిట్ బ్యూరో సమావేశంలో వైసీపీపై కూడా తీవ్ర విమర్శలు చేశారు.

## రామగుండం..అగ్నిగుండం

### ఎండల తీవ్రతతో ప్రజల బెంబేలు



**రామగుండం,మే21 :** రోహిణీ కార్తె ముందు రోళ్లు పగిలే ఎండలు కొట్టడం ప్రకృతి సహజ వైపరీత్యం. కానీ, ఈసారి కార్తెకు వారం రోజుల ముందు నుంచే ఎండలు ఉగ్రరూపం దాల్చడంతో రామ గుండం పారిశ్రామిక ప్రాంతం అగ్నిగుండంగా తయారైంది. గురువారం రామగుండంలో ఎండ తీవ్రత ప్రమాద స్థాయిలో ఉందని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ హెచ్చరిక జారీ చేసింది. ఈమేరకు పారిశ్రామిక ప్రాంతంలోని పలువురి మొబైల్ ఫోన్లకు సందేశాలు పంపించడంతో హడలెత్తిపోయారు. మధ్యాహ్నం 12 గం.ల నుంచి 4 గం.ల వరకు ఎట్టి పరిస్థితిలోనూ బయటకు రావొద్దని హెచ్చరించింది. వీలైనంత వరకు ఇంటిలోనే ఉంటూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తాగాలని సూచిక జారీ చేసింది. ఐతే గత నాలుగు రోజులుగా రామగుండంలో ఊహిం చని స్థాయిలో ఎండలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. 45 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతల భయానికి జనాలు ఇళ్ల నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. చుట్టూ వివిధ భారీ పరిశ్రమలు ఉం డటంతో మిగతా ప్రాంతాల కంటే గోదావరిఖనిలో ఎండ దగడు ప్రమాద స్థాయిలో ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## తిరుమలలో పెరిగిన రద్దీ

### వేసవి సెలవులతో భక్తుల రాక
### దర్శనానికి 24గంటలకు పైగా సమయం

**తిరుమల,మే21 :** వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో రద్దీ పెరుగుతోంది. శ్రీవారి దర్శనానికి కనీసం 24 గంటలపైగా సమయం పడుతోంది. శ్రీవారి దర్శనానికి గురువారం కూడా భక్తుల రద్దీ కొనసాగుతోంది. దీంతో భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్2, నారాయణగిరి షెడ్స్ నిండిపోయి రింగ్ రోడ్డులోని పాచికాల్వ గంగమ్మ ఆలయం వరకు క్యూలైన్లో సుమారు నాలుగు కిలోమీటర్లు వేచి ఉన్నారు. సర్వదర్శనానికి 24 గంటలపైగా సమయం పడుతోందని తితిదే ప్రకటించింది. రద్దీ నేపథ్యంలో సంయమనంతో శ్రీవారిని దర్శించుకోవాలని తితిదే భక్తులకు సూచిస్తోంది. మరోవైపు తితిదే ఆధ్వర్యంలో ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, నారాయణగిరి షెడ్లు, అన్నప్రసాద కేంద్రాలు, ప్రధాన రహ దారులు, పార్కింగ్ ప్రాంతాలు, ఆలయ పరి సర ప్రాంతాల్లో నెల కొన్న పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేసి, అధికారులు అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. క్యూలైన్‌లో భక్తులకు తాగునీరు, పాలు, అన్న ప్రసాదాలు శ్రీవారి సేవకుల ద్వారా అందిస్తున్నారు. తితిదే యంత్రాంగం సమన్వయం తో భక్తులకు దర్శనం కల్పించేందుకు 24 గంటలూ ప్రత్యేకంగా దృష్టి సారించారు. పోలీసులు, తితిదే విజిలెన్స్ అధికారులు రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి రద్దీని నియంత్రిస్తున్నారు. రద్దీ నేపథ్యంలో అధికారులు భక్తులను క్యూలైన్లలోకి అనుమతించడం లేదు.

## బిజెపి, కాంగ్రెస్‌ల పాలన సాగుతోంది

### సర్ ప్రక్రియ పట్ల అప్రమత్తంగా ఉండాలి
### పార్టీ సభ్యత్వ నమోదులో బాజిరెడ్డి

**నిజామాబాద్,మే21 :** తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కలిసి పరిపాలన సాగిస్తున్నాయని ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం సభ్యత నమోదు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.పార్టీ నాయకులు సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఓటరు సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం స్నేహపూర్వకంగా ఉంటూ బీఆర్ఎస్ పార్టీని టార్గెట్ చేసి కుటిల రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్, మాజీ జడ్పీ చైర్మన్ దాదాన్నగారి విట్టల్ రావు, మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, తదితరులు పాల్గొన్నారు.

## దళారుకుల ధాన్యం అమ్ముకోవద్దు

### రైతులకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి సూచన

**ఆసిఫాబాద్,మే21 :** రైతులు తాము పండించిన జొన్న ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మార్కెట్ కమిటీ గోదాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్), మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో క్వింటాల్ జొన్నలకు మద్దతు ధర రూ. 3,699 ప్రభుత్వం చెల్లించి కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుమేత విశ్వనాథ్ రావు, జైనూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కొడప ప్రకాష్, జైనూర్ సహకార సంఘం చైర్మన్ కొడప హన్ను పటేల్, ఆసిఫాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్ హాజరయ్యారు.

## అగ్నిప్రమాదంలో వరిపొలం దగ్ధం

### పరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు వినతి

**పెద్దపల్లి,మే21 :** కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేటలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన పుల్లూరి సాగర్ కు చెందిన 1.20 గుంటల వరి పొలం మంటల్లో కాలి బూడిదైనట్లు బాధితుడు తెలిపాడు. సాగర్ కు గ్రామ శివారులో ఎకరా 20గుంటల వరి పొలం ఉంది. హార్వెస్టర్లు రాక పొలం కోయలేదు. గురువారం ఉదయం ఓ గ్రామానికి చెందిన హార్వెస్టర్ పొలం కోయడానికి రాగా అప్పటికే మంటల్లో కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్షా యాభైవేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. గ్రామ శివారులో మిట్ట మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు వరి కొయ్యకాలుకు నిప్పంటించడంతో పలువురు రైతులకు చెందిన వరి కొయ్యకాలుతో పాటు, విద్యుత్ వైర్లు, పైపులు, తాటిచెట్లు మంటల్లో కాలి బూడిదయ్యాయి. రూ.లక్షల్లో ఆస్థినష్టం జరిగినట్లు గ్రామస్తులు వాపోయారు. గ్రామస్తులు ÷ర్ ఇంజన్‌కు సమాచారమిచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చే సరికి పొలం మొత్తం మంటల్లో బూడిదైంది.


# సంపాదకీయం

## ట్రంప్ అధికారాలకు కత్తెర

ప్రపంచం అతలాకుతలం అవుతున్నా..తనకేమీ పట్టనట్టు ట్రంప్ మహాశయుడు ఫిడేల్ వాయిస్తు న్నాడు. యుద్ధం ..యుద్ధం అంటూ కలవరిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు తప్పవని హెచ్చరిస్తున్నాడు. అయితేపశ్చిమాసియా యుద్ధానికి సంబంధించి తాజాగా తీవ్ర ఉత్కంఠ పరిణామాలు చకచకా చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం తెరవెనక సాగుతున్న చర్చల్లో ఒప్పందం కుదరకుంటే... 2-3 రోజుల్లోనే.. లేదంటే వచ్చే వారం ఆరంభంలో తాము ఇరాన్‌పై దాడులతో విరుచుకుపడతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. దీంతో మరోమారు ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇప్పటికే అమెరికా సహా అన్ని దేశాలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నా ట్రంప్ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ కళ్ళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. దీంతో అయినా ట్రంప్ దూకుడు ఆగతుందా అన్నది చూడాలి. ఇకపోతే ఇరాన్‌తో భారీస్థాయిలో చర్చలు జరుగుతున్నాయని, అవి సఫలమై.. మా దాడి ప్రణాళిక శాశ్వతంగా అటకెక్కుతుందని ఆశిస్తున్నా అంటూ ట్రంప్ తాజాగా వెల్లడించాక ఈ తీర్మనం వచ్చింది. టెహ్రాన్ చేతికి అణ్వాయుధాలు దక్కకుండా ఉండే ఒప్పందం మాకు ఆమోదయోగ్యమవుతుందని శ్వేతసౌధంలో విలేకర్లతో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై భారీ స్థాయిలో వెంటనే దాడులు చేసేందుకు సన్నద్ధంగా ఉండాలని తమ అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మంగళవారమే భారీ స్థాయిలో దాడులు జరపాలనుకున్నట్లు ట్రంప్ వెల్లడించారు. అయితే అరబ్ దేశాల నేతల విజ్ఞప్తి మేరకు చివరి నిమిషాల్లో ఆ ప్రణాళికను తాత్కాలికంగా పక్కనపెట్టానన్నారు. టెహ్రాన్‌తో చర్చలు సీరియస్‌గా సాగుతున్నాయని, అందరికీ ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదిరే అవకాశాలు ఉండటం వల్లే దాడుల నిర్ణయాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఈ క్రమంలో ట్రంప్ వ్యవహాఇర శైలి చూస్తుంటే ఆయన దేనికైనా తెగిస్తాడని అనుకోవాలి.ఇకపోతే ఇరాన్ కూడా గట్టిగానే సమాధ్యానం ఇస్తోంది. అమెరికా-ఇజ్రాయెల్ మళ్లీ దాడులు చేస్తే.. తాము యుద్ధరంగంలో కొత్త సాధనాలతో, సరికొత్త విధానాల్లో విరుచుకుపడతామని ఇరాన్ హెచ్చరించింది. తమను దిగ్బంధించడం, ఓడించడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొంది. టెహ్రాన్‌లోని వాలియాస్ స్క్వేర్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆ దేశ సైన్యాధికారి బ్రిగేడియర్ జనరల్ మహమ్మద్ అక్రమీనియా ఈ వ్యాఖ్యలు చేశారు. తమ సాయుధ దళాలు గతంలో కంటే ఇప్పుడు మరింత బలంగా, సన్నద్ధంగా ఉన్నాయని ఇరాన్ పేర్కొంది. సైన్యం ట్రిగ్గర్‌పై వేలు పెట్టి సిద్ధంగా ఉందని హెచ్చరించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను హతమారిస్తే.. 58 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.560 కోట్లు) బహుమతిగా ఇస్తామని ఇరాన్ త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ మేరకు 'ఇస్లామిక్ రిపబ్లిక్ భద్రతా దళాల ప్రతిచర్య' పేరిట బిల్లును సిద్ధం చేస్తున్నట్లు ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్ ఇబ్రహీమ్ అజీజ్ తెలిపారు. దీనిపై త్వరలోనే పార్లమెంటులో ఓటింగ్ నిర్వహిస్తామన్నారు. తమ దేశంలోని బరకాహ్ అణు విద్యుత్కేంద్రంపై ఇటీవల దాడి చేసిన డ్రోన్లు ఇరాక్ భూభాగం నుంచి దూసుకొచ్చాయని యూఏఈ రక్షణ శాఖ మంగళవారం వెల్లడించింది.ఇరాన్ మద్దతున్న షియా మిలీషియాలు వాటిని ప్రయోగించి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ ఇటీవల చేసిన దాడులు పర్యావరణానికి హానికరంగా మారి, జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. ఇరాన్ ఆయిల్ రి÷నైరీపై జరిగిన ఓ దాడితో సముద్ర జలాల్లోకి చమురు చేరి.. అలల ద్వారా పర్షియన్ గల్ఫ్‌లోని శిద్వార్ దీవిపైకి కొట్టుకొచ్చింది. అది జనావాసాల్లేని దీవి. వన్యప్రాణులు చాలానే ఉన్నాయి. చమురు వ్యాప్తితో వాటి మనుగడకు సమస్యలు తలెత్తుతున్నాయి. ఇవన్నీ ఇప్పుడిప్పుడే బయటకు వస్తున్నాయి. అమెరికా దూకుడు తగ్గకుంటే ప్రపంచంలో ఆర్థిక, ఆహార సంక్షోభం తీవ్రం కానుంది. ఇప్పటికే గల్ఫ్ దేశాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. ఇది మరింత తీవ్రం అయ్యే ప్రమాదం ఉంటి. ఖతార్ లాంటి దేశాల్లో ఆహార కొరత తీవ్రంగా ఉంది. వారి వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో శాంతి చర్చలకు ప్రపంచ దేశాలు ఒత్తిడి చేయాల్సిన అవసరం ఉంది.

# ట్రంప్ దూకుడుకు సెనెట్ కళ్లెం

- యుద్ధ అధికారాలను పరిమితం చేస్తూ తీర్మానం



వాషింగ్టన్,మే21 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరాన్‌పై ఆయన దూకుడు ప్రవర్తనకు అమెరికా సెనెట్ క్లళెం వేసింది. అధ్యక్షుడి యుద్ధ అధికారాలను పరిమితం చేసే తీర్మానానికి తాజాగా ఆమోదం లభించింది. ఫిబ్రవరి చివరిలో ఇజ్రాయెల్‌తో కలిసి ట్రంప్ ఇరాన్ పై యుద్ధానికి దిగారు. యుద్ధంపై ట్రంప్ అధికారాలను పరిమితం చేసేందుకు డెమోక్రట్లు అనేకసార్లు సెనెట్‌లో ఓటింగ్ నిర్వహించారు. అయితే, వారి తీర్మానాలకు తగినంత ఓటింగ్ లభించలేదు. డెమోక్రటిక్ సెనెటర్ టిమ్ కెయిన్ తాజాగా మరోసారి సెనెట్ ముందుకు తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. యుద్ధ ప్రకటన, సైనిక చర్యకు కాంగ్రెస్ నుంచి స్పష్టమైన ఆమోదం లభిస్తే తప్ప.. ఇరాన్ లోపల లేదా దానికి వ్యతిరేకంగా జరిగే ఘర్షణల్లో యూఎస్ దళాలు పాల్గొనకూడదని అందులో తెలిపారు. దీనికి 50 మంది అనుకూలంగా.. 47 మంది వ్యతిరేకంగా ఓట్లు వేశారు. ఈ తీర్మానం ఆమోదంలో నలుగురు రిపబ్లికన్ సభ్యులు కూడా మద్దతుగా ఓటు వేయడం గమనార్హం. కాగా.. ఈ బిల్లు ఆమోదానికి సంబంధించి త్వరలో తుది ఓటింగ్ జరగనుంది. ఇది చట్టంగా మారితే.. కాంగ్రెస్ అధికారికంగా సైనిక దాడి కొనసాగించడానికి అనుమతి ఇచ్చేవరకు ట్రంప్ ఇరాన్‌పై ఎలాంటి దాడులకు దిగకూడదు. ఓటింగ్ సందర్భంగా డెమోక్రటిక్ సెనెట్ చక్ షుమర్ మాట్లాడుతూ.. యుద్ధానికి సంబంధించిన నిర్ణయాలపై కాంగ్రెస్ తిరిగి పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 'ఈ అధ్యక్షుడు నిండుగా తూటాలున్న తుపాకీతో ఆడుకుంటున్న చిన్నపిల్లాడిలా ఉన్నాడు' అని వ్యాఖ్యానించారు. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చలు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## జనగణనలో కులగణనకు సుప్రీం ఓకే



- వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లు తిరష్కరణ

న్యూఢిల్లీ,మే21: కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ధర్మాసనం కొట్టివేసింది. ఈ మేరకు బుధవారం జస్టిస్ సూర్యకాంత్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించారు. సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. జన గణన.. కుల ప్రాతిపదికన జరగాలా వద్దా అనేది విధానపరమైన నిర్ణయమని పేర్కొంది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ఈ ధర్మాసనం వ్యాఖ్యానించింది. నగణన నుంచి కులగణనను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం తిరస్కరించింది. ఈ అంశం ప్రభుత్వ విధాన పరిధిలోకి వస్తుందని వివరించింది. అందులో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని తెలిపింది. ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జయమల్యా బాగ్చీ, విపుల్ పంచోలీతో కూడిన ధర్మాసనం విచారించింది.

## టిడిపి మహానాడులో 19 తీర్మానాలు



- తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు
- తీర్మానాల కమిటీ సభ్యుడు సోమిరెడ్డి వెల్లడి

అమరావతి, మే 21 : రెండు రోజుల పాటు నిర్వహించే మహానాడులో మొత్తం 19 తీర్మానాలు ప్రవేశపెట్టాలని తీర్మానాల కమిటీ నిర్ణయించిందని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. వీటిలో తెలంగాణకు సంబంధించి రెండు తీర్మానాలు ఉంటాయన్నారు. తొలిసారిగా అండమాన్‌కు సంబంధించి ఒక తీర్మానం మహానాడులో ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మహానాడు తీర్మానాల కమిటీ సమావేశం ముగిసింది. ఈ సమావేశానికి తీర్మానాల కమిటీ సభ్యుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహా పలువురు సభ్యులు హాజరయ్యారు. కీలక నిర్ణయాలను తీసుకున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్.. టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత తొలిసారి నిర్వహిస్తున్న మహానాడు కావడంతో పార్టీ శ్రేణులకు ప్రతిష్ఠాత్మకంగా మారిందని అన్నారు. ఈ మేరకు మిగతావి ఏపీకి సంబం ధించిన తీర్మానాలు ఉంటాయన్నారు. మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ పార్టీపై విమర్శలు గుప్పించారు సోమిరెడ్డి. గత రెండేళ్లుగా ఏపీలో పౌరులందరూ స్వేచ్ఛగా జీవిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విధ్వంసానికి మారుపేరుగా గొడ్డలి పార్టీ మారిందని సోమిరెడ్డి మండిపడ్డారు. రెండేళ్లుగా ఏపీ సాధించిన పెట్టుబడులు గతంలో ఎప్పుడూ రాలేదని కొనియాడారు. సీఎం చంద్రబాబు బ్రాండ్, లోకేశ్ కృషి, పవన్ తోడ్పాటు, కేంద్రం మద్దతుతో ఎన్నడూ లేని విధంగా పెట్టుబడులు సాధించామని పేర్కొన్నారు. నెల్లూరులో మహానాడు నిర్వహించలేకపోయామనే బాధ ఉన్నప్పటికీ.. పొదుపు చర్యల కోసం హైబ్రిడ్ విధానం తప్పలేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు.

## సంక్షేమ నిధి నుంచి జర్నలిస్టులకు ఆర్థిక సాయం



- 21 మందికి మంజూరు చేసినట్లు వెల్లడి

హైదరాబాద్,మే21 : జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి 21 మందికి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జర్నలిస్టుల సంక్షేమ నిధి కమిటీ 5వ సమావేశం చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆర్థిక సహాయం కోసం వచ్చిన 29 దరఖాస్తులను కమిటీ సభ్యులు పరిశీలించి 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు, తీవ్ర ప్రమాదాలకు గురైన, దీర&ఝకాలికంగా అనారోగ్యం బారిన పడిన నలుగురు జర్నలిస్టులకు కూడా కమిటీ ఆర్థిక సహాయం మంజూరు చేసింది. కమిటీ సమావేశంలో ఎంపికైన 17 మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం, అలాగే ఆయా కుటుంబాలకు ప్రతి నెల మూడు వేల రూపాయల చొప్పున పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు అందజేస్తామని ఆయన తెలిపారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలలో ఎల్.కే.జి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న ఇద్దరు పిల్లలకు ఒక్కొక్కరికి నెలకు ఒక వెయ్యి రూపాయల చొప్పున ట్యూషన్ ఫీజును మంజూరు చేస్తున్నట్లు ఆయన వివరించారు. నలుగురు అనారోగ్యం బారిన పడిన వర్కింగ్ జర్నలిస్టులకు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. కమిటీ సమావేశంలో సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, అకౌంట్స్ ఆఫీసర్ పూర్ణ చందర్ రావు, మేనేజర్ డి.ఆర్.ఎస్. శైలెశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగానికి 'డిజిటల్' బూస్ట్

- ఇన్‌ఫ్లుయర్లు సామాజిక బాధ్యతతో తీసుకోవాలి
- డ్రగ్స్, బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్‌పై చైతన్యం కల్పించాలి
- త్వరలో 'ప్రభాత భేరి' సామాజిక చైతన్య కార్యక్రమం
- ఉత్తమ టూరిజం క్రియేటర్లకు అవార్డులు, ప్రోత్సాహకాలు
- 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, మే 21: 'పర్యాటక రంగం కేవలం విహార యాత్రలకే పరిమితం కాదు.. అది రాష్ట్ర ఆర్థికాభి వృద్ధికి, యువతకు ఉపాధికి, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌కు శక్తివంతమైన సాధనం' అని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. డిజిటల్ వేదికల ద్వారా తెలంగాణ ప్రకృతి అందాలు, చారిత్రక వైభవం, సంస్కృతి సంపదను ప్రపంచానికి చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 99 రోజుల కార్యాచరణను వేగవంతం చేసిన రాష్ట్ర ప్రభుత్వం, పర్యాటక రంగానికి కొత్త ఊపునివ్వడానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందన్నారు. పర్యాటక వారోత్సవాల సందర్భంగా బేగంపేట టూరిజం ఎ÷-లాజాలో నిర్వహించిన 'తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశం'లో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇచ్చిన సలహాలు సూచనలు స్వీకరించి పర్యాటక రంగాన్ని మరింత మెరుగు పరుస్తామని చెప్పుతునే.. పర్యాటక ప్రమోషన్ తో పాటు ప్రజల్లో ముఖ్యంగా యువతలో సామాజిక స్పృహ కలిగించడానికి కృషి చేయాలని దిశానిర్ధేశర చేశారు. పర్యాటక ప్రాంతాల ప్రోత్సాహంతో స్థానిక యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి తెలిపారు. పర్యాటక రంగం ద్వారా వచ్చే ఆదాయాన్ని వైద్య, ఆరోగ్య, విద్యా రంగాల బలోపేతానికి, పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగిస్తామని చెప్పారు. 'మన ప్రాంతాలను మనమే చూడకపోతే జీవితం సంపూర్ణం కాదు' అని పేర్కొన్న ఆయన.. తెలంగాణలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు ఆర్థిక స్థోమత అడ్డంకి కాదన్నారు. అనవసర ఖర్చులను తగ్గించుకుని కుటుంబంతో కలిసి పర్యాటక ప్రాంతాల్లో గడపడం వల్ల మానసిక ప్రశాంతత, ఆనందం లభిస్తాయని సూచించారు. దేశ, విదేశీ పర్యాటకులతో పాటు స్వరాష్ట్ర ప్రజలు కూడా తెలంగాణ పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా సందర్శించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత, కనీస వసతులు, ఆధునిక టెంట్ వసతి సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టామని తెలిపారు. వినియోగంలో లేని హరిత మోటళ్లు, పర్యాటక భూములను ఆదాయ వనరులుగా మార్చే దిశగా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయర్లు కేవలం పర్యాటక ప్రమోషన్‌కే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని మంత్రి జూపల్లి సూచించారు. యువత.. గంజాయికి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు, బెట్టింగ్‌కు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వీటితో మానసిక రుగ్మతకు గురై బంగారు భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక, మానసిక రుగ్మతలను రూపుమాపేందుకు ఇన్ఫ్లు యెన్సర్లు తమ కంటెంట్ ద్వారా సామాజిక చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రభాత భేరి అనే సరికొత్త సామాజిక చైతన్య కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించబోతుందని, లఘు చిత్రాలు, నాటికలు, రంగస్థల ప్రదర్శనలు, వివిధ కళా రూపాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యచరణను అమలు చేయబోతున్నామని ప్రకటించారు. తెలంగాణ సంస్కృతి, వారసత్వం, ఆతిథ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో క్రియేటర్లు భాగస్వాములు కావాలని మంత్రి కోరారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగస్వాములయ్యే కంటెంట్ క్రియేటర్లకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. తెలంగాణను ప్రపంచ పర్యాటక మ్యాప్‌లో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబరిచే టూరిజం క్రియేటర్లకు ప్రభుత్వం తరఫున అవార్డులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందజేస్తామని మంత్రి జూపల్లి ప్రకటించారు. సందర్భంగా రాష్ట్ర పర్యాటక శాఖ నూతన మెటా ఖాతా, అధికారిక ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌ను మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. తెలంగాణ చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, హస్తకళలు, చేనేత, కలంకారీ కళా వైభవాన్ని ప్రతిబింబించే 'టైమ్‌లెస్ తెలంగాణ' వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమంలో పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, ఎండీ గౌతమి, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, నిథమ్ డైరెక్టర్ వెంకట రమణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి తదితరులు పాల్గొన్నారు.



# పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి...

**-ఆర్ సెటీ శిక్షణ కోర్సులతో యువతకు మేలు**

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**




ఉచిత శిక్షణను యువతీ యువకులు వినియోగించుకోని,ఆర్థిక స్వాతంత్రం సాధించి,మరో పది మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. .కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ, బ్యాంకుల సహకారంతో ఆర్ సెటీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూ నగర్ శిక్షణా కేంద్రంలో జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణా కార్యక్ర మాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం ప్రారంభించారు.

శిక్షణ ఇచ్చే, ట్రైనింగ్, వసతి గదులను ప్రారంభించి.. పరిశీలించారు. ఈ సందర్భంగా మగ్గం వర్క్ కింద శిక్షణ పొంది పలువురు అభ్యర్థులు సిద్ధం చేసిన వస్త్రాలను పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోజూ ఎన్ని గంటలు శిక్షణ పొందుతున్నారో ఆరా తీశారు. మగ్గం వర్క్ తర్ఫీదు పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని అన్నారు .

గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రంలోనే ఆర్ సెటీ కేంద్రాలు ఉండేవని, ఇప్పుడు మన జిల్లాలో కూడా అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు ఇక్కడ అందించే ఉచిత వసతి, భోజనం, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. శిక్షణలో భాగంగా అందించే ప్రతి మెలకువను ఎంతో శ్రద్ధ, ఆసక్తితో నేర్చుకొని.. స్వయం ఉపాధిలో ఆ అంశాలు వినియోగించాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు.మార్కెట్, పరిశ్రమల అవసరాలు, అభ్యర్థుల డిమాండ్ కు అనుగుణంగా నూతన కోర్సులు ప్రారంభించాలని, ఏడాది అంతా శిక్షణ అందించాలని నిర్వాహకులకు సూచించారు.కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, యూబీఐ డీజీఎం నటరాజ్, ఏజీఎం శ్రీనివాసరావు, ఎల్ డీ ఎం మల్లికార్జున రావు, శిక్షణ కేంద్రం బాధ్యులు, బ్యాంక్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అనంతారంలో నిప్పంట్టుకొని రైతులకు భారీ నష్టం

**గడ్డి వాములు పశువుల పాకలు**

**మోటార్లు అగ్నికి అహుతి**

**బలగం, టీవీ ఇల్లంతకుంట**



ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడం తో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.గ్రామంలో పలువురు రైతులకు చెందిన పశువుల కోసం నిల్వ చేసుకొన్న గడ్డి వాములు, పాకలు, బోర్ బావి మోటార్లు వైర్లు పూర్తిగా దగ్ధమైనాయి. అరుగాలం పండించిన పంటలను అతి కష్టం మీద అమ్ముకుంటున్న రైతులకు దెబ్బ మీద దెబ్బ తగిలి అల్లాడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టన్ని అంచనా వేసి రైతులను అధికారులు ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక సర్పంచ్ రజిత వెంకటేష్ లు కోరారు



# నేడు ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సభ

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 22 వ తేదీన శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి సభ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు .ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా చేపట్టనున్న జిల్లా స్థాయి సభ పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..ప్రజాప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాలపై విస్తృత అవగాహన కల్పించడం, పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం, స్థానిక సమస్యలు, అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించడంతో పాటు రాబోయే రోజుల్లో చేపట్టబోయే ప్రభుత్వ పథకాల గురించి తెలియజేయడం, తదితర అంశాలపై ఈ సభ నిర్వహించడం జరుగుతుందని అన్నారు .మార్చి 6 వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు . జిల్లాలో ఇప్పటికే గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సభలు నిర్వహించడంతో పాటు ప్రతీ వారం వివిధ శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు .జిల్లా స్థాయి సభ సిరిసిల్ల పట్టణ రగుడు సమీపంలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఉదయం 10.00 గంటలకు నిర్వహించనున్నామని అన్నారు . జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.అలాగే యువజన, క్రీడా వారోత్సవాల సందర్భంగా 22 వ తేదీ సాయంత్రం 06.00 గంటలకు సిరిసిల్ల పట్టణం కొత్త చెరువు వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించడానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.సమావేశంలో సిరిసిల్ల ఆర్డీఓ రాజేందర్ రెడ్డి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, డీపీఆర్ఓ ఏడుకొండలు, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ పనులను ప్రభుత్వ లక్ష్యం మేరకు పూర్తి చేయాలి..




**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల ?:

ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీ పనులు చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఊర చెరువులో జల సంచాయ్ – జన్ భాగిదారి కింద ఉపాధి హామీ పనులు కొనసాగుతుండగా, గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ లక్ష్యం మేరకు కూలీలకు ఉపాధి హామీ కింద ఉపాధి హామీ కల్పించాలని సూచించారు. ప్రతి రోజూ 150 మంది పనికి వచ్చేలా చూడాలని ఆదేశించారు. పని చేసే చోట నీడ సదుపాయం, తాగు నీరు, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని సూచించారు. నిరక్షరాస్య కూలీలు ఉల్లాస్ కింద చదువు నేర్చుకోవాలని పేర్కొన్నారు.రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు సన్న వడ్లు సాగు చేయాలని పిలుపు నిచ్చారు.

**కొనుగోలు కేంద్రంలో తనిఖీ**

తంగళ్లపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తనిఖీ చేశారు. ఇప్పటి దాకా ధాన్యం ఎంత వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? ఎంత ఏ రైస్ మిల్లుకు తరలించారో ఆరా తీశారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని, ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని సూచించారు.పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ, సర్పంచ్ లక్ష్మీరాజం, ఎంపీడీఓ రమేష్, ఇంచార్జి తహసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి..



**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లులలో అన్ లోడింగ్ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకోసం హమాలీల సంఖ్యను పెంచాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం సేకరణ, బస్తాల తరలింపు, మిల్లుల్లో అన్ లోడింగ్, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీల వేగవంతంపై గురువారం కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మరియు వివిధ శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, లారీలు, ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు, అపరెల్ పార్క్‌కు తరలించిన వాహనాలు నిలిచిపోకుండా తక్షణమే అన్ లోడ్ చేయించాలని స్పష్టం చేశారు. కేంద్రాల్లో గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని, వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ముందస్తుగా టార్పాలిన్లను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరిస్తూ, ఆన్‌లైన్ ట్యాబ్ ఎంట్రీలను ఎప్పటికప్పుడు పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.

# రాజీవ్ గాంధీ ఆశయాలే కాంగ్రెస్ పార్టీకి మార్గదర్శకం

**రాజీవ్ గాంధీ కీర్తి అజరామరం**

**కాంగ్రెస్ బోయినిపల్లి మండల అధ్యక్షులు**

**కొమ్మనబోయిన సువీన్ యాదవ్**

**తడగొండ గ్రామంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మాజీ**

**ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి**

**కూలీలకు మజ్జిగ, పండ్ల పంపిణీ**

**రాజీవ్ గాంధీకి ఘన నివాళులు**

**బలగం టీవీ, బోయినిపల్లి;**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా రాజీవ్ గాంధీని స్మరిస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా సువీన్ యాదవ్ మాట్లాడుతూ: భారతదేశాన్ని సాంకేతిక రంగంలో ప్రపంచ దేశాల సరసన నిలబెట్టిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని, ఆయన కీర్తిని కొనియాడారు. దేశాభివృద్ధి కోసం చేసిన కృషి, త్యాగాలు వెలకట్టలేనివని, ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్ వ్యవస్థ వల్లే నేడు గ్రామాల్లో అధికారం సామాన్యులకు చేరువైందని గుర్తు చేశారు.

**మజ్జిగ పంపిణీ చేసిన కాంగ్రెస్ శ్రేణులు**

అనంతరం ఉపాధి హామీ పథకంలో భాగంగా మండుటెండలో పనులు నిర్వహిస్తున్న కూలీల వద్దకు నాయకులు వెళ్లారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి మజ్జిగ, పండ్లు పంపిణీ చేశారు. ఈ చిన్న సహాయం కూలీలకు ఎంతో ఊరటనిచ్చింది. సామాన్యుల కష్టసుఖాల్లో పాలుపంచుకోవడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని సువీన్ యాదవ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో తడగొండ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, ఏఎంసి ఛైర్మెన్ బోయిని ఎల్లేష్ యాదవ్, వైస్ ఛైర్మెన్ వినోద్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, సర్పంచులు నల్ల మోహన్,జంగం అంజయ్య, డైరెక్టర్ బొంగోని వెంకటేష్, అద్దంకి రమేష్, శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గుడి శ్రీనివాస్ రెడ్డి, ఎండి హుస్సేన్, మండల శ్రీను, ముచ్చ శేఖర్ రెడ్డి, బాబు, అనుపట్ల తిరుపతి రెడ్డి, జాగిరి శోభన్, జంగ సత్యం, నాగుల వంశీ,చేపూరి వెంకటేష్, దయ్యాల రాజశేఖర్, కొలుపుల ప్రవీణ్, మందల వరుణ్, మందల వంశీ, జాగిరి వెంకటేష్, కేశవ రెడ్డి, మండల నరేష్, దూస రాజశేఖర్, ప్రజా ప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.




# హోమ్ గార్డ్ కుటుంబానికి ఇన్సూరెన్స్ చెక్ అందజేత..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

జిల్లా పోలీస్ కార్యాలయంలోని డిసిర్బిలో విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన హోమ్ గార్డ్ దేవయ్య యాక్సిస్ బ్యాంక్ లో సాలరీ అకౌంట్ ఉన్నందున యాక్సిడెంటల్ డెత్ కింద మంజూరు కాబడిన 30 లక్షల ఇన్సూరెన్స్ చెక్ యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యం ఎస్పీ మహేష్ బి.గితే చేతుల మీదుగాదేవయ్య కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు.ఈసందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసిన హోమ్ గార్డ్ దేవయ్య మరణం పోలీస్ శాఖకు తీరని లోటని,దేవయ్య కుటుంబ సభ్యులకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.పోలీస్ సిబ్బంది,హోమ్ గార్డులు తమ విధులను నిర్వర్తించే సమయంలో భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈకార్యక్రమంలో డిఎస్పీ నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, ఆర్ఐ రమేష్, యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యం, దేవయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




# శాంతి ప్రకాష్ శుక్లా ఆశయ సాధనకు యువత ముందుకు రావాలి..

**-సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం తపించిన గొప్ప మనిషి, ప్రముఖ న్యాయవాది శాంతి ప్రకాష్ శుక్లా అని, ఆయన ఆశయాల సాధన కోసం నేటి యువతరం, ప్రజానీకం ముందుకు కదలాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర సమరయోధులు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నాయకులు, సిరిసిల్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దివంగత కామ్రేడ్ అమృత్ లాల్ శుక్లా తనయుడైన శాంతి ప్రకాష్ శుక్లా ఈనెల 7వ తేదీన అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ నేపథ్యంలో, సిరిసిల్ల పట్టణంలోని వారి నివాసంలో శుక్లా కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో శుక్లా దినకర్మ సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ అధ్యక్షత వహించాగా, సభ ప్రారంభానికి ముందు శాంతి ప్రకాష్ శుక్లా చిత్రపటానికి కుటుంబ సభ్యులతో పాటు హాజరైన ప్రముఖులందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

ఈ సంస్మరణ సభలో జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు రామరాజు మాట్లాడుతూ శుక్లా సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. సిరిసిల్ల సాహితీ సమితి అధ్యక్షులు జనపాల శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వెంగళ లక్ష్మణ్, భూపతి నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత, సీనియర్ పాత్రికేయులు మచ్చ ఆనంద్, తడుక విశ్వనాథం, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు సంపత్ రమేష్, బిఎస్ఎన్ఎల్ శ్రీనివాస్ తదితరులు ప్రసంగిస్తూ శాంతి ప్రకాష్ శుక్లాతో తమకున్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన కమ్యూనిస్టు శ్రేయోభిలాషిగా, సామాజిక కార్యకర్తగా సమాజ హితం కోసం నిరంతరం కృషి చేశారని వక్తలు స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా శాంతి ప్రకాష్ శుక్లా గత 40 సంవత్సరాలుగా ప్రజా సేవా రంగంలో పాల్గొన్న వివిధ కార్యక్రమాలు, ఆయన చేసిన సేవలకు సంబంధించిన అరుదైన ఫోటోలు, వీడియోల దృశ్యాలను ఎల్ఈడి స్క్రీన్ ద్వారా సభలో ప్రదర్శించారు. ఈ సంస్మరణ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, శుక్లా కుటుంబ సభ్యులు మరియు శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులర్పించారు.



# అగ్నిగుండంగా మారిన రామగుండం

**ప్రమాద స్థాయికి చేరిన ఎండ తీవ్రత.. మధ్యాహ్నం బయటకు రావొద్దని హెచ్చరిక**

**బలగం టీవీ, గోదావరిఖని**

రోహిణీ కార్తె ప్రారంభానికి ముందే ఎండలు ఉగ్రరూపం దాల్చడంతో రామగుండం పారిశ్రామిక ప్రాంతం అగ్నిగుండంలా మారింది. గతంలో కార్తె సమయంలోనే కనిపించే తీవ్ర ఉష్ణోగ్రతలు ఈసారి వారం రోజుల ముందుగానే నమోదవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రామగుండంలో ఎండ తీవ్రత ప్రమాద స్థాయికి చేరిందని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ గురువారం హెచ్చరికలు జారీ చేసింది. పారిశ్రామిక ప్రాంత ప్రజల మొబైల్ ఫోన్లకు ప్రత్యేక సందేశాలు పంపిస్తూ అప్రమత్తం చేసింది.

మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావొద్దని సూచించింది. వీలైనంత వరకు ఇళ్లలోనే ఉండి, తరచూ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవాలు తీసుకోవాలని ప్రజలకు సూచనలు జారీ చేసింది. గత నాలుగు రోజులుగా రామగుండం పరిసర ప్రాంతాల్లో ఎండ తీవ్రత ఊహించని స్థాయిలో పెరిగింది. 45 డిగ్రీల వరకు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. ముఖ్యంగా చుట్టుపక్కల భారీ పరిశ్రమలు అధికంగా ఉండటంతో గోదావరిఖని ప్రాంతంలో వేడి మరింత తీవ్రంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి రోహిణీ కార్తె ప్రారంభం కానుండటంతో రానున్న రోజుల్లో పరిస్థితి మరింత భయానకంగా మారవచ్చనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచిస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

**జీవన్ రెడ్డి**

**బలగం టీవీ, రాయికల్**



రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు రోడ్లెక్కి ఆందోళన చేస్తే రాజకీయాలు చేస్తున్నారని విమర్శిస్తున్న ప్రభుత్వం, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు ఎందుకు పేరుకుపోయాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గురువారం రాయికల్ వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జీవన్ రెడ్డి పరిశీలించారు. మార్కెట్‌లో సుమారు 40 వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉందని, ఇప్పటికే తూకం వేసిన 20 వేల సంచులు తరలింపుకాక నిలిచిపోయాయని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం మార్కెట్‌లో ధాన్యం నిల్వలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ కలెక్టర్, మార్క్‌ఫెడ్ డీఎంతో జీవన్ రెడ్డి ఫోన్‌లో మాట్లాడారు. రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, లారీలు సమయానికి రాకపోవడంతో ధాన్యం తరలింపు నిలిచిపోయిందని తెలిపారు. రోజుకు కనీసం నాలుగు లారీలు వచ్చినప్పుడే ధాన్యం తరలింపు ప్రక్రియ వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. తాము రైతులతో కలిసి సమస్య పరిష్కారం కోసం రోడ్డు ఎక్కితే రాజకీయాలు చేస్తున్నారంటున్నారని, కానీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అలాగే పేరుకుపోయి ఉందని విమర్శించారు. జిల్లా మార్క్‌ఫెడ్ అధికారులు కనీసం ఫోన్‌కూ స్పందించడం లేదని రైతులు వాపోతున్నారని తెలిపారు. గోదాముల కేటాయింపు, లారీల కొరత సమస్య తీవ్రంగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు జీవన్ రెడ్డి పేర్కొన్నారు. జగిత్యాల మార్కెట్‌లో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ గోదాములు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని వినియోగించడం లేదని ఆరోపించారు. మార్కెట్ గోదాములను కాంట్రాక్టర్ తన అవసరాలకు ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఎక్కడ గోదాములు లభించినా అక్కడికి ధాన్యం తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు జీవన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ హరిచరణ్‌రావు, రాయికల్ మున్సిపల్ ఛైర్మన్ రవి, యువజన నాయకుడు తాటిపర్తి సీకే రెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుల్వామా దాడి సూత్రధారి హమ్జా బుర్హాన్ హత్య

- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో గుర్తు తెలియని వ్యక్తుల కాల్పులు
- పుల్వామా దాడితో పాటు పలు ఉగ్రచర్యల్లో కీలక పాత్ర

బలగం టీవీ, న్యూఢిల్లీ

పుల్వామా ఉగ్రదాడి సూత్రధారుల్లో ఒకరైన హమ్జా బుర్హాన్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో హతమయ్యాడు. ముజఫరాబాద్‌లో గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. పుల్వామాకు చెందిన హమ్జా బుర్హాన్ 2017లో ఉన్నత విద్య కోసం పాకిస్తాన్‌కు వెళ్లాడు. అనంతరం నిషేధిత అల్–బద్ ఉగ్రసంస్థలో చేరి కమాండర్ స్థాయికి ఎదిగినట్లు భద్రతా వర్గాలు తెలిపాయి. తర్వాత తిరిగి కశ్మీర్‌కు వచ్చి యువతలో ఉగ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడంలో కీలక పాత్ర పోషించినట్లు వెల్లడించారు. 2019 ఫిబ్రవరి 14న జరిగిన పుల్వామా దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతి చెందిన ఘటనతో పాటు కశ్మీర్‌లో చోటుచేసుకున్న పలు ఉగ్రవాద చర్యల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో జరిగిన ఈ హత్య వెనుక కారణాలు ఇంకా స్పష్టంకాలేదు. ఘటనపై అక్కడి భద్రతా సంస్థలు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.



# సోషల్ మీడియాలో వైరల్‌గా 'కాక్‌రోచ్ జనతా పార్టీ'

## అనుచరుల సంఖ్యలో బీజేపీ అధికారిక ఖాతాను దాటేసిన వ్యంగ్య వేదిక

- నిరుద్యోగం, పరీక్షల లీకేజీలపై మీమ్స్‌తో యువత ఆకర్షణ

బలగం టీవీ, న్యూఢిల్లీ




సోషల్ మీడియా వేదిక ఇన్‌స్టాగ్రామ్‌లో వ్యంగ్య రాజకీయ కంటెంట్‌తో నడుస్తున్న 'కాక్‌రోచ్ జనతా పార్టీ' ఖాతా అనూహ్యంగా వైరల్ అయింది. అనుచరుల సంఖ్యలో భారతీయ జనతా పార్టీ అధికారిక ఖాతాను కూడా దాటేసి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. గురువారం నాటికి 'కాక్‌రోచ్ జనతా పార్టీ' ఖాతాకు సుమారు 1.80 కోట్ల మంది అనుచరులు ఉండగా, బీజేపీ అధికారిక ఖాతాకు సుమారు 87 లక్షల మంది అనుచరులు ఉన్నట్లు సోషల్ మీడియా గణాంకాలు వెల్లడించాయి. ఈ ఖాతాను కంటెంట్ సృష్టికర్త అభిజీత్ దిప్కే నిర్వహిస్తున్నాడు. నిరుద్యోగం, పోటీ పరీక్షలు, ప్రశ్నాపత్రాల లీకేజీలు, రాజకీయ పరిణామాలపై వ్యంగ్యాత్మక మీమ్స్, చిన్న వీడియోల రూపంలో కంటెంట్‌ను పోస్ట్ చేస్తూ యువతలో విపరీతమైన ఆదరణ పొందుతోంది.

ఇక బీజేపీ దేశంలో అతిపెద్ద రాజకీయ పార్టీగా కొనసాగుతోంది. పార్టీ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 18 కోట్లకు పైగా సభ్యత్వం కలిగి ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిలో భాగంగా 240 స్థానాలు గెలుచుకుంది. మరోవైపు 'కాక్‌రోచ్ జనతా పార్టీ' ప్రస్తుతం పూర్తిగా ఆన్‌లైన్ వ్యంగ్య వేదికగానే కొనసాగుతోంది. ఎన్నికల్లో పోటీపై ఎలాంటి ప్రకటన చేయలేదు. అయితే సరదా మేనిఫెస్టో విడుదల చేయడం, 'పార్టీ సభ్యుల' పేరుతో చిన్న వీడియోలు రూపొందించడం ద్వారా సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం పొందుతోంది. ఈ ట్రెండ్‌పై పలువురు రాజకీయ నాయకులు కూడా స్పందించారు. అఖిలేష్ యాదవ్, మహువా మొయిత్రా వంటి నేతలు సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేయగా, వివిధ రాజకీయ పార్టీల ఇన్‌స్టాగ్రామ్ అనుచరుల సంఖ్యల పోలికలు విస్తృతంగా వైరల్ అయ్యాయి. ఇదే తరహాలో 'రివల్యూషనరీ పార్టీ ఆఫ్ కాక్‌రోచెస్', 'కాక్‌రోచ్ సేవా పార్టీ' వంటి మరికొన్ని వ్యంగ్య వేదికలు కూడా సోషల్ మీడియాలో వెలుగులోకి వస్తున్నాయి.

# కాక్రోచ్ జనతా పార్టీ 'ఎక్స్' ఖాతా నిలిపివేత

- దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన డిజిటల్ ఉద్యమానికి షాక్
- కొత్త ఖాతాతో మళ్లీ రంగంలోకి వచ్చిన సీజేపీ

బలగం టీవీ, న్యూఢిల్లీ

సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన కాక్రోచ్ జనతా పార్టీకి ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అధికారిక ఖాతాను భారత్‌లో నిలిపివేశారు. ఖాతా నిలిపివేసే సమయానికి దాదాపు రెండు లక్షల మంది అనుచరులు ఉన్నట్లు సమాచారం. ఈ చర్యపై స్పందించిన పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే.. ఇది కేవలం సరదా మీమ్ ట్రెండ్ మాత్రమే కాదని, దేశ యువతలో పెరుగుతున్న నిరాశ, అసంతృప్తికి ప్రతిబింబమని పేర్కొన్నారు.

**పార్టీ ఆవిర్భావం వెనుక కథ**

కాక్రోచ్ జనతా పార్టీ ఏర్పాటుకు ఇటీవల సుప్రీంకోర్టులో జరిగిన వ్యాఖ్యలే కారణమని ప్రచారం జరిగింది. ఉద్యోగాలు లేని కొందరు యువకులు జర్నలిస్టులు, సమాచార హక్కు కార్యకర్తలుగా మారి వ్యవస్థపై దాడి చేస్తున్నారనే సందర్భంలో యువతను బొద్దింకలు, పరాన్నజీవులతో పోల్చినట్లు వార్తలు వెలువడటంతో సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ఈ వ్యాఖ్యలకు నిరసనగా అభిజీత్ దిప్కే 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో డిజిటల్ ఉద్యమాన్ని ప్రారంభించారు. బోస్టన్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ పూర్తి చేసిన అభిజీత్, గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ సామాజిక మాధ్యమ విభాగంలో పనిచేశారు. 2020 ఢిల్లీ ఎన్నికల్లో అరవింద్ కేజ్రీవాల్ విజయానికి తన వంతు పాత్ర పోషించినట్లు పేర్కొంటారు. రాజ్యాంగ పరిరక్షకులుగా ఉండాల్సిన ఉన్నత పదవుల్లో ఉన్నవారు యువతను కించపరచడం ఆమోదయోగ్యం కాదనే భావనతో ఈ ఉద్యమాన్ని ప్రారంభించినట్లు అభిజీత్ తెలిపారు.

**యువతను ఆకర్షిస్తున్న మేనిఫెస్టో**

'సోమరులు, నిరుద్యోగుల గొంతుక' అనే నినాదంతో ఈ వేదిక ముందుకు వచ్చింది. తమ వెబ్‌సైట్‌లో ఐదు ప్రధాన డిమాండ్లతో మేనిఫెస్టోను విడుదల చేసింది.

అందులో ముఖ్యంగా:

పదవీ విరమణ అనంతరం ప్రధాన న్యాయమూర్తులకు రాజ్యసభ పదవులు ఇవ్వకూడదని,

పార్టీ మారే ప్రజాప్రతినిధులపై 20 ఏళ్ల నిషేధం విధించాలని,

మహిళలకు 50 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని,

మీడియా సంస్థలపై దర్యాప్తు జరపాలని,

ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత పెంచాలని డిమాండ్ చేసింది.

'కాక్రోచ్ ఈజ్ బ్యాక్'

ఎక్స్ ఖాతా నిలిపివేయబడిన వెంటనే పార్టీ మరో కొత్త ఖాతాను ప్రారంభించింది. "కాక్రోచ్ ఈజ్ బ్యాక్" పేరుతో ప్రారంభించిన ఈ కొత్త ఖాతాకు గంటలోపే వేలాది మంది అనుచరులు చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. తమ ఖాతాను హ్యాక్ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని, ప్రస్తుత పరిణామాలను న్యాయపరంగా ఎదుర్కొంటామని అభిజీత్ వెల్లడించారు. ఇంటర్నెట్‌లో సరదాగా మొదలైన ఈ వ్యంగ్య ఉద్యమం ప్రస్తుతం యువత అసంతృప్తికి వేదికగా మారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది.

# తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వాన

**ఎండల తీవ్రతతో రికార్డు ఉష్ణోగ్రతలు**

**పిడుగురాళ్లలో 48.1ముత్తారంలో 46.5 డిగ్రీలు నమోదు**

బలగం టీవీ, హైదరాబాద్

ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండల తీవ్రతతో తెలుగు రాష్ట్రాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. ఏపీ, తెలంగాణలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగాయి. అంతకంతకూ ఎండ తీవ్రత పెరిగిపోయి రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు బయటకు అడుగుపెట్టాలంటేనే బాబోయ్ ఎండ అనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురిపిస్తున్నాడా అన్నట్లుగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరుగుతున్నాయి. గురువారం రాష్ట్రంలో పలుచోట్ల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏపీలో అత్యధికంగా పిడుగురాళ్లలో 48.1, తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.5, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మార్కాపురం జిల్లా కనిగిరిలో అత్యధికంగా 48.3 డిగ్రీలు నమోదు కాగా, కృష్ణా జిల్లా కంకిపాడులో 47.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏలూరు జిల్లా చింతలపూడిలో 47.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు, పల్నాడు జిల్లా అచ్చంపేటలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 47.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు, బాపట్ల జిల్లా ఇంకొల్లులో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యాయి. ఏపీలోని వేటపాలెం (బాపట్ల), నందివాడ (కృష్ణా)ల్లో 47.6 డిగ్రీలు, ఎన్టీఆర్ జిల్లా తొర్రగుడిపాడు, ప్రకాశం జిల్లా అద్దంకిలో 47.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా అల్లిపల్లిలో 47.3 డిగ్రీలు, నందనమారెళ్ల (మార్కాపురం)లో 46.6, కూనవరం (పోలవరం)లో 46.5, కావలి (శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు)లో 46.4, తెనాలి (గుంటూరు)లో 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. 20 జిల్లాల్లోని 200 మండలాల్లో 44 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం వరకు ఎండల తీవ్రత కొనసాగనుందని అధికారులు తెలిపారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లిలో 46.4, మహబూబాబాద్ జిల్లా కురవిలో 46.3, ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో 46.2, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట్‌లో 46.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీలు దాటాయి. భానుడి భగభగలతో జనం ఇంటి నుంచి కాలు బయట పెట్టడానికి భయపడుతున్నారు. ఏమైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా ఎండలకు హడలిపోతున్నారు. గత వారం నుంచి ఉదయం మొదలు కొని సాయంత్రం వరకూ తీవ్రమైన ఉక్కపోతతో పాటు సెగలు కక్కే ఎండే కనిపిస్తూ ఉండటంతో సాధారణమైన పనులు చేసుకోవడానికి ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు ఈ ఎండలకు ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు. ఏసీలు ఉన్న వారు ఏసీ చాటను, ఫ్యాన్లు ఉన్నవారు ఫ్యాన్ల మాటునే సేద తీరుతూ ఊపిరి పీల్చుకుంటున్నారు. సాయంత్రం ఆరు దాటితే గానీ ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ఈ ఎండల నుంచి ఎప్పుడు ఉపశమనం పొందుతామా అని ఎదురుచూస్తున్నారు ప్రజలు.

# ఏపీలో భారీ పెట్టుబడులపై బాబు ఫోకస్

**ఒప్పంద ప్రాజెక్టులు త్వరగా పూర్తి కావాలి**

**వాటికి అవసరమైన చర్యలు తీసుకోవాలి**

**మంత్రుల కమిటీతో భేటీలో సిఎం సూచనలు**

బలగం టీవీ, అమరావతి

విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ)లో ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. నారా లోకేశ్ నేతృత్వంలోని కమిటీకి ఎంవోయూలు, ప్రాజెక్టుల పురోగతిపై సీఎం దిశానిర్దేశం చేశారు. ఎస్ఐపీబీ ద్వారా ఇప్పటికి రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని చంద్రబాబు గుర్తుచేశారు. వీటిలో 114 ప్రాజెక్టులు గ్రౌండ్ అయినట్టు సీఎంకు మంత్రుల కమిటీ ఛైర్మన్ నారా లోకేశ్ వివరించారు. భాగస్వామ్య సదస్సులో ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టులకు అనుమతులు, భూ కేటాయింపులతో పాటు మిగిలిన ప్రాజెక్టులు గ్రౌండింగ్‌కు వెళ్లేలా చర్యలు చేపట్టాలని సీఎం సూచించారు. రాష్ట్ర అభివృద్ధికి ఇవి కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని సీఎం పేర్కొన్నారు. పెట్టుబడిదారులతో కుదిరిన ఒప్పందాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఎంఓయూలకు సంబంధించిన ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు మంజూరు చేయాలని, అవసరమైన భూ కేటాయింపులు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ దశకు చేరి పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం మాత్రమే కాకుండా, అవి వేగంగా అమలై యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక

అభివృద్ధి వేగవంతం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్‌తో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పెద్ద దోర్నాల్లో ఆర్టీసీ బస్టాండ్‌కు శంకుస్థాపన

బలగం టీవీ, మార్కాపురం

మార్కాపురం జిల్లా దోర్నాల మండలం పెద్ద దోర్నాల్లో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. చిన్నగుడిపాడులో పీఎం సూర్యఘర్, దూపాడు సాగర్ నీటి పథకాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ సునీత, కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు ఎమ్మెల్యేలు ముక్కు ఉగ్రనరసింహ రెడ్డి , కందుల నారాయణరెడ్డి, ముత్తుమల అశోక్ రెడ్డి, తెదేపా ఎర్రగొండపాలెం నియోజకవర్గ బాధ్యుడు ఎరిక్షన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై కేసు నమోదు

బలగం టీవీ, కాకినాడ

ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ కె. నాగేశ్వర్‌పై కాకినాడ జిల్లా ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఓ టెలివిజన్ చర్చా కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నాదెండ్ల మనోహర్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ జనసేన కార్యకర్తలు ఫిర్యాదు చేశారు. సంబంధిత టీవీ ఛానెల్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఇటీవల జరిగిన ఓ టీవీ డిబేట్‌లో ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ, గతంలో పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్‌లు ఢిల్లీలో అమిత్ షాను కలిసి వైఎస్ జగన్‌ను అరెస్టు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా స్పందిస్తూ "రాజకీయాల్లో ఇన్‌స్టంట్ ఫ్రెండ్, లాంగ్ టర్మ్ ఫ్రెండ్ ఉంటారు. చంద్రబాబు ఇన్‌స్టంట్ ఫ్రెండ్, జగన్ లాంగ్ టర్మ్ ఫ్రెండ్. మనకు జగన్ 25 మంది ఎంపీలతో సహకరిస్తున్నారు. మీరు కూడా వైఖరి మార్చుకోండి" అని చెప్పినట్లు నాగేశ్వర్ వ్యాఖ్యానించినట్లు తెలిపారు. అయితే అమిత్ షా ఎప్పుడూ చేయని వ్యాఖ్యలను ఆయన చేసినట్లుగా ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని జనసేన కార్యకర్తలు ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపడంతో పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు ప్రారంభించారు.



# సీపీఎం నాయకులు ఉద్దరాజు బాపిరాజు కన్నుమూత

**ఉద్యమానికి, పార్టీకి తీరని లోటు : జాన్ వెస్లీ**

బలగం టీవీ, హైదరాబాద్

సీపీఎం వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరైన కామ్రేడ్ ఉద్దరాజు రామం గారి కుమారుడు, సీనియర్ కమ్యూనిస్టు సహచరుడు ఉద్దరాజు బాపిరాజు అనారోగ్యంతో బుధవారం రాత్రి 10.30 గంటలకు కన్నుమూశారు. ఆయన వయస్సు 79 సంవత్సరాలు. ఉద్దరాజు బాపిరాజు 1946 సెప్టెంబర్ 12న జన్మించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తెతో పాటు మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఆల్ ఇండియా కిసాన్ సభ అధ్యక్షుడిగా పనిచేసిన ఉద్దరాజు రామం గారి వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లిన బాపిరాజు, ఉద్యోగ జీవితంతో పాటు ఉద్యమ జీవితానికీ సమాన ప్రాధాన్యం ఇచ్చారు. బయోలాజికల్ సంస్థలో పదేళ్లు పనిచేసిన అనంతరం 1980 ఆగస్టు నుంచి మిధానిలో విధులు నిర్వహించి 2006లో పదవీ విరమణ పొందారు. మిధానిలో పనిచేసే సమయంలో కార్మిక సంఘ ఉద్యమంలో చురుకుగా పాల్గొని సీఐటీయూ యూనియన్‌కు నాయకత్వం వహించారు. అలాగే ఉద్యోగ బాధ్యతలతో పాటు జనవిజ్ఞాన వేదిక కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర పోషించారు. మిధానిలో లైబ్రరీ నిర్వహణకు విశేషంగా సహకరించారు.

ఎమర్జెన్సీ కాలంలో సీపీఎం నాయకులకు అండగా నిలిచిన ఆయన, ఎన్.వి. భాస్కరరావు తదితరులకు అజ్ఞాత జీవితం సాగించే సమయంలో ఆశ్రయం కల్పించినట్లు పార్టీ నాయకులు గుర్తుచేశారు. జీవితాంతం సాధారణ జీవన విధానాన్ని అనుసరిస్తూ పార్టీ ఆశయాలకు కట్టుబడి ఉన్నారు. సీపీఎం చరిత్రకు సంబంధించిన పుస్తకాలు, ఫోటోలు, లేఖలు, నాయకుల జ్ఞాపకాలను సేకరించడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. ఈ చారిత్రక పత్రాలను పార్టీ రాష్ట్ర నాయకత్వానికి అందజేస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉద్దరాజు రామం గారి పేరుతో పుస్తకం తీసుకురావడంలో బాపిరాజు కీలక పాత్ర పోషించారు. అయితే ఉద్దరాజు రామం గారి పార్లమెంట్ ప్రసంగాలను పుస్తక రూపంలో తీసుకురావాలన్న ఆయన కోరిక నెరవేరకుండానే మిగిలిపోయింది. ఉద్దరాజు బాపిరాజు మృతికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్. వీరయ్య, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ నాయకుడు డీజీ నరసింహరావు, మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి. సత్యం తదితరులు నివాళులర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ బాపిరాజు మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఉద్దరాజు రామం గారి వారసత్వాన్ని కొనసాగిస్తూ చివరి వరకు ఉద్యమంతో అనుబంధం కొనసాగించారని కొనియాడారు. ఆయన సేకరించిన చారిత్రక పత్రాలు, ఫోటోలు, పుస్తకాలు ఉద్యమ చరిత్రకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

# కూతురు ప్రేమ వ్యవహారంపై అనుమానం.. తండ్రి దారుణం

**తలను చెరువులో, శరీర భాగాలను రైల్లో పడేసిన ఘటన**

**ఉత్తర్‌ప్రదేశ్‌లో సంచలనం**

బలగం టీవీ, న్యూఢిల్లీ

తన కుమార్తె వేరే కులానికి చెందిన యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతోందనే అనుమానంతో ఓ తండ్రి అమానుషానికి పాల్పడ్డాడు. కన్న కూతురిని అత్యంత పాశవికంగా హత్య చేసి, శరీరాన్ని ముక్కలుగా నరికి ఆధారాలు చెరిపివేయడానికి ప్రయత్నించిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో సంచలనం రేపింది.

పోలీసుల వివరాల ప్రకారం.. కుషీనగర్‌కు చెందిన బిగ్గన్ అన్సారీ ఈ–రిక్షా నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల తన చిన్న కుమార్తె ఓ యువకుడితో తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు గమనించాడు. ఆమెను పలుమార్లు మందలించినప్పటికీ వినకపోవడంతో హత్యకు పథకం రచించాడు. ఈ విషయాన్ని తన సోదరి నూర్జహాన్, బావ మొజిబుల్లా అన్సారీలకు చెప్పి కలిసి హత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు ముందు భార్య, ఇతర పిల్లలను ఇంటి నుంచి పంపించిన అనంతరం బాలికను హత్య చేసి శరీరాన్ని ముక్కలుగా నరికినట్లు విచారణలో వెల్లడైంది. బాలిక తలను సమీపంలోని చెరువులో పడేసి, మిగతా శరీర భాగాలను సంచుల్లో కట్టి రైలులోని స్లీపర్ కోచ్‌లో వదిలేసినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం గజ ఈతగాళ్ల సాయంతో చెరువులో గాలింపు చేపట్టగా బాలిక తలను గుర్తించారు.

**రైలులో బయటపడిన ఘటన**

మే 17న ఛప్రా–గోమతి నగర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎస్–1 బోగీని శుభ్రం చేస్తుండగా అనుమానాస్పద పెట్టె కనిపించిందని రైల్వే అధికారులు తెలిపారు. వెంటనే తనిఖీ చేయగా అందులో బాలిక మొండెం, చేతులు, కాళ్లు వేర్వేరు పాలిథీన్ సంచుల్లో లభించినట్లు వెల్లడించారు. రక్తపు మరకలు బయటకు కనిపించకుండా నిందితులు జాగ్రత్తలు తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసిన పోలీసులు దాదాపు 800 సీసీటీవీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ఈ క్రమంలో తమ్కుహి రోడ్ రైల్వే స్టేషన్‌లో ఇద్దరు పురుషులు, ఓ మహిళ కలిసి పెట్టెను రైలులో ఉంచిన దృశ్యాలు బయటపడ్డాయి. దీంతో నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు అధికారులు తెలిపారు. నేరానికి ఉపయోగించిన ఆయుధాన్ని కూడా చెరువులో నుంచి స్వాధీనం చేసుకున్నారు.



# హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ

**గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనలు కోకొల్లలు**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు**

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో గోవధ నిషేధ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్‌లో గోవుల అక్రమ రవాణా, వధ జరుగుతోందని అన్నారు. చట్టాలు ఉన్నప్పటికీ కొందరు కావాలనే వాటిని ఉల్లంఘిస్తున్నారని ఆయన మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గోవధ జరుగుతోందని రాంచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గోమాత రక్షణ కోసం శాంతియుతంగా పనిచేస్తున్న గోరక్షకులు, బీజేపీ కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని రాంచందర్ రావు ఆరోపించారు. గోరక్షకులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, అరెస్టు చేసిన కార్యకర్తలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ కార్యకర్తలపై విధించిన బైండోవర్ చర్యలను వెంటనే రద్దు చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గోవుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రాంచందర్ రావు సూచించారు. గోవధకు పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. క్ష్మిరిళిలీసులు పక్షపాత ధోరణిని విడిచిపెట్టి చట్టాన్ని అందరికీ సమానంగా అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు. గోమాత హిందువుల జీవన విధానంలో పవిత్రమైన భాగమని, పండుగల పేరుతో గోవధ చేస్తే సహించబోమని హెచ్చరించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే శక్తులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణలో గోవధ నిరోధక చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన తమ కార్యకర్తలను వెంటనే విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

# 'కాక్రోచ్ జనతా పార్టీ'కి ఎమ్మెల్యే మద్దతు

**తానే తొలి కాక్రోచ్ ఎమ్మెల్యేనన్న అర్జున్ చౌతాలా**

బలగం టీవీ, హైదరాబాద్

హరియాణా రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇండియన్ నేషనల్ లోక్ దళ్ ఎమ్మెల్యే అర్జున్ చౌతాలా తనను తాను 'కాక్రోచ్ జనతా పార్టీ' తొలి ఎమ్మెల్యేగా ప్రకటించుకోవడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వ్యంగ్య డిజిటల్ ఉద్యమానికి తన మద్దతు ప్రకటించారు.

హరియాణా మాజీ ముఖ్యమంత్రి ఓం ప్రకాశ్ చౌతాలా మనవడైన అర్జున్ చౌతాలా మాట్లాడుతూ.. "నేను ఒక కాక్రోచ్‌ని, అదే సమయంలో ఎమ్మెల్యేని కూడా" అని వ్యాఖ్యానించారు. దేశ యువతను బొద్దింకలతో పోల్చినట్లు ప్రచారంలోకి వచ్చిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యలు పూర్తిగా తప్పని అన్నారు. వ్యవస్థ చేత అణచివేతకు గురవుతున్న యువతకు తాను సంఘీభావం తెలుపుతున్నానని పేర్కొన్నారు.

"మానవులు పుట్టకముందే బొద్దింకలు ఈ భూమిపై ఉన్నాయి. ప్రపంచం అంతమయ్యే వరకు కూడా అవి మనుగడ సాగిస్తాయి. వాటి జీవనశక్తిని తక్కువ అంచనా వేయడం చరిత్రను విస్మరించడమే" అని అన్నారు. న్యాయమూర్తి పదవిలో ఉన్నవారు పక్షపాతం లేకుండా వ్యవహరించాలని అర్జున్ చౌతాలా అభిప్రాయపడ్డారు. యువత ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును రాజ్యాంగం కల్పించిందని, ఆ స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. దేశ పౌరులు పెద్ద పారిశ్రామిక వర్గాల కంటే ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నారని, అలాంటి పరిస్థితుల్లో యువత గళాన్ని అణగదొక్కరాదని వ్యాఖ్యానించారు. దేశంలో యువత మార్పును కోరుకుంటోందని, అందుకే కాక్రోచ్ జనతా పార్టీకి విస్తృత మద్దతు లభించిందని తెలిపారు. ఒకే రాత్రిలో ఆ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ అనుచరుల సంఖ్య బీజేపీని దాటిందని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆ పార్టీ సామాజిక మాధ్యమ ఖాతాలను నిలిపివేశారని ఆరోపిస్తూ.. "ఒక కాక్రోచ్‌ను పదిసార్లు తొక్కినా అది మళ్లీ లేస్తుంది" అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు.

